తీన్మార్
తెలుగు దినపత్రిక

# రేవంత్ రెడ్డికి కత్తిమీద సాము!

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు, ఫలితాల తరువాత ప్రకటించిన మేరకు వివిధ అంశాల మీద శ్వేత పత్రాలను ప్రకటిస్తూ జనాలకు వాస్తవాలను వెల్లడించే ఒకమంచి పని చేస్తున్నారు. మిగిలిన వాటి మీద కూడా వెంటనే ప్రకటిస్తారని ఆశిద్దాం. వీటికి పోటీగా స్వేద పత్రాన్ని విడుదల చేస్తామని బిఆర్ఎస్ ప్రకటించింది. మథనం జరగడం మంచిదే. దేన్నయినా మూసిపెడితే పాచిపోతుందన్నది ఒక సామెత. అధికారానికి వచ్చిన కొత్తలో గతంలో కూడా కొన్ని ప్రభుత్వాలు శ్వేత పత్రాల ను విడుదల చేశాయి. సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న ఈ రోజుల్లో సోషల్ మీడియాలో వస్తున్న సమాచారం గందరగోళాన్ని సృష్టిస్తున్నది. పైకి ఎన్ని సుభాషితాలను వల్లించినా మీడియా రాజకీయ శిబిరాలవారీ చీలి నాణానికి ఒకవైపు మాత్రమే చూపుతూ తాను మద్దతు ఇచ్చే పక్ష ప్రతికూల సమాచారాన్ని తొక్కిపెడుతున్నది. చాకుతో కూరగాయలతో పాటు మెడను కూడా కోయవచ్చు. శ్వేతపత్రాలు కూడా అలాంటివే. జనానికి వాస్తవాలు చెప్పే మంచితో పాటు ఆ సమాచారాన్ని చూపే పాలకులు వాగ్దాన భంగాలకూ పాల్పడవచ్చు. గత అనుభవాన్ని బట్టి దీనికి ఏ పార్టీ మినహాయింపు కాదు. ఎవరి మీదా భ్రమలు పెట్టుకోనవసరం లేదు. తెలంగాణ ఆర్థిక స్థితి గురించి వెల్లడించిన పత్రంలోని వివరాలు, రాష్ట్ర సర్కారుకు ఎదురయ్యే సవాళ్ల గురించి చూద్దాం. గత పాలకులు చెప్పిన దానికి భిన్నంగా ప్రభుత్వం ఎక్కువ మొత్తంలో అప్పులు చేసింది. 2014లో రాష్ట్ర విభజన సమయంలో వున్న అప్పు రూ. 72,658 కోట్లు. 2023 డిసెంబరు నాటికి అది రూ. 6,12,343 కోట్లకు పెరిగింది. దీనిలో రాష్ట్ర ప్రభుత్వం నేరుగా తీసుకున్న (ఎఫ్ఆర్బిఎం పరిమితికి లోబడి) రుణం రూ 3,89, 673 కోట్లు. పదిహేడు నిర్దిష్ట అవసరాల కోసం (స్పెషల్ పర్పస్ వెహికిల్స్) తీసుకున్న అప్పు రూ. 1,27,208 కోట్లు, ప్రభుత్వ హామీతో 14 సంస్థలు తీసుకున్న మొత్తం రూ. 95,462 కోట్లు వున్నాయి. ఇవిగాక జెన్కో, ట్రాన్స్కో, సింగరేణి వంటి వివిధ సంస్థలు స్వంతంగా తీసుకున్న రుణాల బకాయిలు రూ. 59,414 కోట్లు కూడా కలుపుకుంటే మొత్తం బకాయిలు రూ. 6,71,757 కోట్లని శ్వేత పత్రంలో పేర్కొన్నారు. ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా లోకానికి చూపించిన కాళేశ్వరం పథకానికి రుణ మంజూరు రూ. 97,449 కోట్లు కాగా విడుదల చేసింది రూ. 79,287 కోట్లు, దీని అప్పు ఇంకా రూ. 74,590 కోట్లు వుంది. ఈ రుణాలకు గాను చెల్లిస్తున్న అసలు, వడ్డీలు 2015లో మొత్తం రూ. 7,255 కోట్లు (బడ్జెట్ రాబడిలో 14%) ఉంటే 2023లో రూ. 53,978 కోట్ల (బడ్జెట్లో 34%)కు చేరాయి. ఎఫ్ఆర్బిఎం నిబంధనల ప్రకారం రాష్ట్ర జిఎస్డిపిలో 25% వరకు అప్పులు తీసుకోవచ్చు. ప్రస్తుతం 27.8 శాతంగా వున్నాయి. ఇవిగాక ఇతరంగా తీసుకున్న అప్పులను కూడా పరిగణనలోకి తీసుకుంటే 36.9 శాతానికి చేరాయి. దీంతో రాష్ట్ర రుణ అర్హత పరిమితి తగ్గింది. బడ్జెట్ కేటాయింపులను పూర్తిగా ఖర్చు చేయడం లేదని, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో తేడా ఎక్కువగా వుందని శ్వేత పత్రం పేర్కొన్నది. 2004 నుంచి 2014 మధ్య ఉమ్మడి రాష్ట్రంలో బడ్జెట్ కేటాయింపుల్లో మొత్తంగా 87% ఖర్చు చేశారు. తెలంగాణ ఏర్పడిన తరువాత అది 82.3 శాతానికి దిగజారింది. ఆర్బిఐ నివేదిక ప్రకారం 2021 22లో పద్దెనిమిది సాధారణ రాష్ట్రాలలో రాజస్థాన్ 116.4 శాతంతో ప్రథమ స్థానంలో ఉండగా, పదిహేడవదిగా ఉన్న తెలంగాణలో 79.3 శాతమే ఖర్చు చేశారు. చివరిదిగా 74.7 శాతంతో పంజాబ్ ఉంది. కాంట్రాక్టర్లు, ఉద్యోగులు, కార్మికులు, ఇతరులకు చెల్లించాల్సిన బిల్లుల మొత్తం రూ. 40,155 కోట్లు వుంది. నిధులు లేనపుడు వేస్ అండ్ మీన్స్, ఓవర్ డ్రాఫ్టుల రూపంలో ఆర్బిఐ నుంచి రుణాలు తీసుకొనే సౌకర్యం వుంది. అడ్డామీద కూలీకి ఏరోజు పని దొరికితేనే ఆ పూట భుక్తి. రాష్ట్ర స్థితి కూడా అలాంటిదే. ఈ కారణంగానే ప్రతి నెలా ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటవ తేదీనే చెల్లించలేని స్థితి. పిఆర్సి, కరువు భత్యం వాయిదాల పద్ధతిలో చెల్లిస్తుండగా, సకాలంలో మంజూరు చేయకుండా సంవత్సరాల తరబడి నిలిపివేస్తున్నారు. (ప్రస్తుతం రేవంత రెడ్డి రైతుబంధును కూడా దశవారీ విడుదల చేస్తున్న కారణం అదే). 201516లో కేవలం రెండు సార్లు మాత్రమే మాత్రమే వేస్ అండ్ మీన్స్ సౌకర్యాన్ని వినియోగించుకోగా తరువాత సంవత్సరాల్లో క్రమంగా పెరిగింది. 2022 23 లో ఏడాదిలో 328 రోజులు తీసుకున్నారు. వర్తమాన సంవత్సరంలో నవంబరు 23 నాటికి 214 రోజులు తీసుకున్నారు. రేవంత రెడ్డి సర్కార్కు సైతం మరో మార్గం లేదు. 2014 15లో గరిష్ఠంగా 303 రోజులు నగదు నిల్వలు ఉండగా, ప్రస్తుతం అవి 30 రోజులకు పడిపోయాయి. నీళ్లు, నిధులు, నియామకాలలో తెలంగాణ ప్రాంతానికి అన్యా యం జరుగుతున్నందున ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆందోళన జరిగింది. 2014లో ఆంధ్రప్రదేశ్ నుంచి విడదీసి తెలంగాణను ఏర్పాటు చేసినపుడు ఆస్తులు అప్పుల విభజన 58 42 దాషామాతో జరిగింది. దీనికి జనాభా ప్రాతిపదిక. ఉమ్మడి రాష్ట్రంలో 1956 57లో వాస్తవ వ్యయం రూ. 79 కోట్లు కాగా, తెలంగాణ వాటా రూ. 33 కోట్లు. రాష్ట్రం విడిపోయే నాటికి మొత్తం వ్యయం రూ. 11,94,945 కోట్లు కాగా, తెలంగాణలో ఖర్చు రూ. 4,98,053 కోట్లు అంటే 41.68 శాతం వుంది. (రాష్ట్రం ఉమ్మడిగా వున్నపుడు ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వ, పరిశోధనా సంస్థలు వాటిలో పెట్టుబడులను కూడా కలుపు కుంటే తెలంగాణలో అంతకంటే ఎక్కువ మొత్తమే ఖర్చు జరిగింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు అనుబంధంగా హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాల్లో వచ్చిన ప్రైవేటు పరిశ్రమల పెట్టుబడులు వీటిలో లేవు. వీటి గురించి శ్వేత పత్రంలో ఎలాంటి ప్రస్తావన లేదు)

ఇక విద్యుత్ రంగ పరిస్థితి మీద విడుదల చేసిన పత్రంలో వున్న వివరాల ప్రకారం పది సంవత్సరాల నాడు పంపిణీ కంపెనీలు (డిస్కామ్సు) రూ. 12,186 కోట్ల నష్టాలతో ఉండగా ప్రస్తుతం రూ. 62,461 కోట్లకు చేరాయి. ప్రభుత్వ బకాయిలే రూ. 43,770 కోట్లు వున్నాయి. విద్యుత్ క్రమబద్ధీకరణ కమిషన్ ముందు ప్రతిపాదించి ఆమోదం పొందిన దానికన్నా వాస్తవిక వ్యయం పెరిగితే దాన్ని ట్రూ అప్ ఛార్జీలు అంటారు. తాత్కాలిక అవసరాల కోసం కొనుగోలు చేసిన విద్యుత్ యూనిట్ ధర రూ. 5.86 నుంచి గరిష్ఠంగా రూ. 20వరకు వుంది. ఒక్క 2022 23లోనే ట్రూ అప్ ఛార్జీల మొత్తం రూ. 12,550 కోట్లు. ఇవిగాక క్రమబద్ధీకరణ కమిషన్ ఆమోదం పొందిన సమయంలో విద్యుత్ తయారీకి వినియోగించే బొగ్గు, గ్యాస్ వంటి ఇంధన ధరల్లో పెరుగుదల ఎంత వుంటే అంత సర్దుబాటు చార్జీలపేరుతో అదనంగా వసూలు చేయవచ్చు.

# మృతిచెందిన హోంగార్డ్ కుటుంబానికి 4వ బెటాలియన్ సిబ్బంది ఆర్థిక సాయం



మామునూరు, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): టిఎస్ఎస్పి నాలుగో బెటాలియన్ నందు హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న వి. రాజ్ కుమార్ (హెచ్ జి 629) నవంబర్ 22న ఆత్మహత్య చేసుకుని మరణించాడు. ఈ సందర్భంగా మామునూరు నాలుగో బెటాలియన్ లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అందరూ కలిసి మొత్తం 2,31,750/– రూపాయలను హోంగార్డ్ వి. రాజ్ కుమార్ యొక్క భార్య దీపికకు 31750/– నగదు రూపంలో కుమార్తె లక్ష్మీ ప్రసన్న పేరున 100000/–, కుమారుడు ధనుష్ పేరున 100000/–బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసి ఆ చెక్కులను రాజ్ కుమార్ కుటుంబానికి నాలుగో బెటాలియన్ కమాండెంట్ డి. శివప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ బాధిత హోంగార్డ్ కుటుంబానికి పోలీస్ శాఖ అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని, ధైర్యంగా జీవితాన్ని కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు జయరాం, రాంబాబు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శోభన్, రమేష్, దయాశిలా, చంద్రన్న, పురుషోత్తం రెడ్డి, రాజకుమార్, అశోక్, ఆర్ఎస్ఐ సోమయ్య అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# కొమ్ము విజయలక్ష్మికి నివాళు లర్పించిన కాంగ్రెస్ నాయకులు



పాలేరు ప్రతినిధి, డిసెంబర్ 27(తీన్మార్ న్యూస్): కూసుమంచి మండలం, తురకగూడెం గ్రామానికి చెందిన కొమ్ము విజయలక్ష్మి (25) మంగళవారం రాత్రి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న కూసుమంచి మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు జొన్నలగడ్డ రవి కుమార్, బోల్లంపల్లి సుధాకర్ రెడ్డి విజయలక్ష్మి పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మంచి భవిష్యత్ ఉన్న యువతి ఇలా అర్థాంతరంగా తనువు చలించడం బాధాకరం అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వార్డ్ నెంబర్ కొమ్ము ప్రభాకర్ రావు, కొండ మహిపాల్, కన్నెబోయిన సురేష్, తదితరులు నివాళుర్పించారు.

# అబ్బాపురం క్రాస్ వద్ద బస్ షెల్టర్ నిర్మించాలి

**– అధికారులను కోరుతున్న ప్రయాణికులు, భక్తులు, ప్రజలు**

ములుగు, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): ములుగు మండలంలోని జాకారం శివారులోని అబ్బాపురం క్రాస్ రోడ్ మూడు వైపులా ప్రధాన రహదారులు ఉన్నాయి. ప్రధానంగా ఈ రహదారి పలు గ్రామాలను, మండలాలను పట్టణాలను, నగరాలను కలిపే ఏకైక మార్గం జన సమూహం అధికంగా ఉంటుంది. నిత్యం ఈ రహదారి ద్వారా లారీలు, మోటార్ వెహికల్, బస్సులు, ఆటోలు నడుస్తూ రవాణతో ఈ రహదారి రద్దీగా ఉంటుంది. ఒక పక్క ములుగు, మేడారం సమ్మక్క సారలమ్మ జాతర, రామప్ప , ఏటూరు నాగారం, భద్రాచలం, వాజేడు, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని భూపాలపట్నం ఇంకో పక్క వరంగల్, హన్మకొండ, మల్లంపల్లి, నర్సంపేట, ఆత్మకూరు మరో వైపు కోనరావుపేట, బుగులోని







జాతర, పాండవుల గుట్ట, గోరికొత్తపల్లి, కొప్పుల, చెన్నాపురం, రేగొండ, భూపాలపల్లి, కాళేశ్వరం, చిట్యాల, పరకాల, టేకుమట్ల, మంథని, గోదావరిఖని మంచిర్యాల,పెద్దపల్లి, జమ్మికుంట, మహారాష్ట్ర విదర్భలోని సిరొంచ, గడ్చిరోలి వంటి పట్టణాలను, నగరాలను గ్రామాలను కలుపుతుంది అబ్బాపురం క్రాస్ రోడ్. ఇప్పటికైన మంత్రి సీతక్క, ములుగు కలెక్టర్ స్పందించి గిరిజనాభివృద్ధి సంస్థ ( ఐటీడీఏ ) నిధులతో అబ్బాపురం క్రాస్ రోడ్ వద్ద ఆర్టీసి బస్సు షెల్టర్ మరియు స్టేజ్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు, భక్తులు, ప్రజలు కోరుతున్నారు.

# ప్రజా పాలన కార్యక్రమం ప్రారంభించనున్న ఎమ్మెల్యే

**– వేముల వీరేశం**

రామన్నపేట, డిసెంబర్ 27(తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న 6 గ్యారెంటీల పథకానికి సంబంధించి డిసెంబర్ 28 నుండి జనవరి 06 వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమంను మొదటి రోజు రామన్నపేట మండలంలోని నిధాన్ పల్లి, బోగారం గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న గ్రామ సభకు నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. కావున ఇట్టి కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి ఉద్యోగులు, సరైన సమయంలో హాజరై గ్రామ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని రామన్నపేట ఎంపిడిఓ జి. జలెందర్రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాని అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ డిమాండ్**



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ డ్రాలో ఇండ్లు రాని అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మొదటి ప్రాధాన్యత కల్పించాలని, డ్రాలో వచ్చిన 112 మందికి వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం లబ్ధిదారులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆయన ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముశం రమేష్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ డబుల్ బెడ్ రూమ్లో డ్రాలో ఇండ్లు రాని వారి సమస్య పరిష్కారం పట్ల నిర్లక్ష్యం వహించారన్నారు. గత పది సంవత్సరాల నుండి ఎంతో ఆశతో సొంత ఇంటి కొరకు ఎదురు చూస్తున్న వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందని ద్రాక్షగా మారాయన్నారు. ఓట్ల రాజకీయం కోసం కాలయాపన చేయడం వలన అర్హులైన పేదలకు అన్యాయం జరిగిందని, ఇప్పుడు మళ్లీ దరఖాస్తులు పెట్టుకుంటే వాళ్ల సమస్య మళ్లీ మొదటికి వచ్చే పరిస్థితి వచ్చిందన్నారు. డ్రా లో డబల్ బెడ్ రూమ్ ఇల్లు వచ్చిన 112 మందికి సిరిసిల్ల శాంతినగర్లో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని చెప్పి ఇంతవరకు కేటాయించక పోవడంతో వారి పరిస్థితి కూడా అయోమయంగా మారిందన్నారు. కొత్త ప్రభుత్వం ఇల్లు ఇస్తుందా ఇవ్వదా? అనే సందేహంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, జిల్లా కలెక్టర్ వెంటనే సమస్యపై జోక్యం చేసుకొని డ్రాలో రాని వాళ్లందరికీ ఇందిరమ్మ పథకంలో మొదటి ప్రాధాన్యత ఇచ్చి న్యాయం చేయాలని, అదేవిధంగా డబల్ బెడ్ రూమ్ ఇళ్ళను కేటాయించని 112 మందికి వెంటనే శాంతినగర్లో ఇండ్లను అందించాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు న్యాయం జరగని పక్షంలో డబుల్ బెడ్ రూమ్ డ్రాలో రాని వాళ్ళందరితో ఎక్కడ ప్రభుత్వం స్థలం ఉంటే అక్కడే గుడిసెలు వేసుకునే కార్యక్రమం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, సూరం పద్మ, బెజుగం సురేష్, గోవిందు లక్ష్మణ్, మోర తిరుపతి, దాసరి రూప, చందుపట్ల పోచమల్లు, లావణ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఐఎంఎస్ స్కూల్ లో ప్రజాపాలన గ్రామసభ

పెద్దపల్లి డిసెంబర్ 27: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అభయహస్తంలో భాగంగా ప్రజా పాలన గ్రామసభను పెద్దపల్లి మున్సిపల్ 5వ వార్డు లో గురువారం మధ్యాహ్నం 2గంటలకు ఇండియన్ మిషన్ సెకండరీ స్కూల్లో నిర్వహించనున్నారు. ఇందులో వార్డు ప్రజల నుండి మహాలక్ష్మి పథకం(ప్రతి నెల రూ. 2500 ఆర్థిక సహాయం, రూ. 500కు గ్యాస్ సిలిండర్), రైతు భరోసా పథకం(రైతులకు ప్రతి ఏటా ఎకరానికి రూ. 15,000 సహాయం), ఇందిరమ్మ ఇండ్ల పథకం, గృహ జ్యోతి పథకం(కుటుంబానికి ప్రతినెల 200యూనిట్ల ఉచిత విద్యుత్తు), చేయుత(కొత్త పింఛన్) పథకం కోసం దరఖాస్తును తీసుకోనున్నారు. సమావేశానికి వచ్చే వార్డ్ ప్రజలు దరఖాస్తుదారుని ఫోటో తోపాటు కుటుంబసభ్యుల అందరి ఆధార్ కార్డు జిరాక్స్, తెల్ల రేషన్ కార్డు జిరాక్స్, ఇంటి కరెంటు మీటరు జిరాక్స్, గ్యాస్ బుక్ జిరాక్స్, పట్టాదారు పాసుబుక్ జిరాక్స్ తీసుకొని దరఖాస్తులు సమర్పించుకోవాలని సంబంధిత అధికారులు తెలిపారు.

# నాయబ్ తహసీల్దార్ గా లక్ష్మీకాంత్



పెబ్బేరు, డిసెంబర్ 27(తీన్మార్ న్యూస్): మండల రెవెన్యూ నూతన నాయబ్ తహశీల్దార్ గా లక్ష్మీకాంత్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ నాయబ్ తహశీల్దారుగా పని చేస్తున్న విజయసింహ్మా వనపర్తి జిల్లా కలెక్టరేట్ కు బదిలీపై వెళ్లారు. గతంలో ఈయన కొత్తకోట, వీపనగండ్ల మండలాల్లో డిప్యూటీ తహసీల్దార్ గా చేశానని చెప్పారు. గతంలో ఇదే తహశీల్దార్ కార్యాలయంలో 2012లో ఆర్ఐ,గా 2016లో సీనియర్ అసిస్టెంట్ గా పని చేయడం గమనార్హం. ఈ సందర్భంగా కలం నిఘా విలేఖరితో నాయబ్ తహశీల్దార్ లక్ష్మీ కాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడానికే తొలి ప్రాధాన్యతనిస్తామని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్షణమే వారికి కావలసిన ధ్రువీకరణ పత్రాలు అందించే విధంగా, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. నూతన బాధ్యతలు చేపట్టిన నాయబ్ తహశీల్దారుకు రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు.

# మహిళా రైతులతోనే వ్యవసాయాభివృద్ధి



జహీరాబాద్, : మహిళా రైతులతోనే వ్యవసాయరంగం అభివృద్ధి చెందుతుందని డీడీఎసబోర్డు డైరెక్టర్ డా. రుక్మిణీరావు పేర్కొన్నారు. ప్రపంచ విత్తనదినోత్సవం సందర్భంగా డీడీఎసలో మహిళారైతులు వివిధరకాల విత్తనాలను ప్రదర్శిం చారు. ఇందులో 26 గ్రామాలకు చెందిన రైతులు 50రకాల విత్తనాలను ప్రదర్శనకు తీసుకువచ్చారు. ఎక్కువ రకాల విత్తనాలను తీసుకువచ్చిన బిడెకన్నె, గుంజోటీ గ్రామాల మహిళారైతులు చంద్రమ్మ, నర్సమ్మ తదితర రైతులను సన్మానించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డీడీఎసబోర్డు డైరెక్టర్ డా. రుక్మిణీరావు మాట్లా డుతూ..

జహీరాబాద్ ప్రాంతంలో డీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా రైతులు 40 ఏళ్లుగా పాతపంటల విత్తనాలను కాపాడుతున్నారన్నారు. ఈ మహిళారైతుల వద్ద సుమారు 50రకాల పైచిలుకు విత్తనాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం సహాయ సహకారాలను అందిస్తే ఇలాం టివారు ఆర్థికంగా నిలదొక్కుకుంటార న్నారు. జహీరాబాద్ ప్రాంతంలో డీడీఎస్ వివిధరకాల కార్యక్రమాలను చేపట్టి దేశవిదేశాల్లో మహిళారైతులకు అరుదైన గౌరవం దక్కేలా కృషి చేశామన్నారు. విత్తనాలను మార్కెట్లో విక్రయించడంకంటే మండల కేంద్రాల్లో, గ్రామాల్లో కమ్యూనిటీ సీడ్బ్యాం కులను ఏర్పాటు చేయాలని సూచించారు. విత్తనాలకు సంబంధించి శాస్త్రవేత్తలు చేసే పరిశోధనల్లో మహిళారైతులను భాగస్వా మ్యం చేయాలన్నారు. కార్యక్రమంలో డీడీఎస్ మహిళాసంఘాల రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి ఏరియాలో 94.7 శాతం పోలింగ్

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 27: భూపాలపల్లి సింగరేణి ఏరియాలో బుధవారం జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 వరకు కొనసాగింది. భూపాలపల్లి ఏరియాలో పనిచేస్తున్న మొత్తం 5410 కార్మికుల కోసం 9 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే కార్మికులు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసే వరకు 5123(94.7% ) మంది కార్మికులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కేటీకే –5 ఇట్కంక్లెన్ పోలింగ్ కేంద్రంలోకి సీపీఐ అనుబంధ సంఘం ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు రెడ్ టీషర్ట్లు ధరించి వెళ్తుండగా పోలీసులు, ఐఎన్టీయూసీ నాయకులు అడ్డుకోగా ఇరువర్గాల మధ్య స్వల్పంగా తోపులాట జరిగింది. కేటీకే –2 ఇట్కంక్లెన్ పోలింగ్ కేంద్రంలోకి ఐఎన్టీయూసీ నాయకులు కాంగ్రెస్ పార్టీ కండువాలు వేసుకొని వెళ్లగా పోలీస్ అధికారులు వారిని అడ్డుకోగా వారి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన ఐదుగురు బృందం ఎన్నికల సరళిని పర్యవేక్షించింది. అనంతరం 9 పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్స్లను అంబేద్కర్ స్టేడియంలోని మినీ ఫంక్షన్ హాల్ కు తరలించారు. సాయంత్రం 7 గంటలకు అంబేద్కర్ స్టేడియంలోని మినీ ఫంక్షన్ హాల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్నది. 5 టేబుళ్లను ఏర్పాటు చేసి రెండు రౌండ్లలో ఓట్లను లెక్కించి అర్ధరాత్రి వరకు ఫలితాలు తెలుపనున్నారు.

# ఆరు గ్యారంటీలు అమలు చేయాలన్న లక్ష్యంతో ప్రజాపాలన

**– రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి**



ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం సరికొత్త పథకాలతో అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తోంది. ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయాలన్న లక్ష్యంతో ప్రజాపాలనకు శ్రీకారం చుట్టినట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సూచన మేరకు బుధవారం రోజు మంచాల మండలంలో 6 గ్యారంటీల పైన,గురువారం రోజు జరిగే కాంగ్రెస్ పార్టీ 139 వ ఆవిర్భావ దినోత్సవం గురించి రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి ఒకరు గడపగడపకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న 6 గ్యారంటీల దరఖాస్తుల ప్రక్రియ నిర్వహించాలని కార్యకర్తలకు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు వింజమూరు రామ్ రెడ్డి, ఎంపీటీసీ ల ఫోరం మండల అధ్యక్షులు ఎడమ నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఏర్పుల రాజు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగల్ విండో డైరెక్టర్లు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఏర్పుల సురేష్, వివిధ గ్రామాల అధ్యక్షులు, మండల నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజా పాలన కార్యక్రమం ఏర్పాట్లపై సమీక్ష

**– జిల్లా కలెక్టర్ జెడెంగే హనుమంతు కొడింబా**



భువనగిరి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 27(తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం ద్వారా ఆరు గ్యారెంటీ పథకాల అమలు కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లతో నిర్వహించాలని, ప్రతి ఒక్కరి నుండి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా కలెక్టరు హనుమంతు కే.జెండగే అధికారులను ఆదేశించారు. బుధవారం నాడు కలెక్టరేటు సమావేశ మందిరంలో మండల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమీషనర్లు, తహాశీలుదార్లు, మండల అభివృద్ధి అధికారులతో రేపు 28 వ తేదీ నుండి జనవరి 6 వ తేదీ వరకు (ప్రభుత్వ సెలవులు డిసెంబరు 31, జనవరి 1 వ తేదీ మినహా) ప్రజాపాలన కార్యక్రమం ద్వారా 6 గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతుతూ మంగళవారం నాడు ఉమ్మడి నల్లగొండ జిల్లా సమావేశంలో మంత్రివర్యులు ప్రజాపాలన కార్యక్రమ అమలుపై దిశానిర్దేశం చేయడం జరిగిందని, ప్రశాంత వాతావరణంలో ఎలాంటి రద్దీ, హడావుడీ లేకుండా ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించాలని, అందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, రోజుకు రెండు గ్రామాలలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు గ్రామ సభల ఏర్పాటుతో తగిన కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. ఉదయం 8.00 గంటలకు కార్యక్రమం ప్రారంభించి ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించాలని తెలిపారు. ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు స్వీకరించాలని, దరఖాస్తులో ఉన్న 5 పథకాలపై కూడా ఒకే దరఖాస్తు ద్వారా స్వీకరించాలని తెలిపారు. ఐదు గ్యారెంటీ పథకాలపైనే కాకుండా ఇతర అంశాలపై కూడా దరఖాస్తులు ఇస్తే స్వీకరించాలని, తప్పనిసరిగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు



చేసి వ్రాయడం రాని వారికి దరఖాస్తులు వ్రాసే విధంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని, దరఖాస్తులు స్వీకరణలో వృద్ధులకు, దివ్యాంగులకు తగిన ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. దరఖాస్తు స్వీకరించిన తదుపరి వెంటనే రశీదు ఇవ్వాలని తెలిపారు. గ్రామ సభకు ఎవరైనా రాలేకపోతే జనవరి 6 వ తేదీ వరకు మున్సిపల్ కార్యాలయం, గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఒక కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని, దరఖాస్తులు స్వీకరిస్తారనే విషయాన్ని ప్రజలకు తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ సభలో తగిన ఏర్పాట్లు చేయాలని, మైక్ ఏర్పాట్లు, టెంట్, కుర్చీలు, టేబుల్స్, క్యూలైన్ బారికేడింగ్స్, దరఖాస్తులు, మంచినీటి సౌకర్యం తదితర వసతులు కల్పించాలని తెలిపారు. జీరాక్సు సెంటర్ల యజమానులు దరఖాస్తుల జీరాక్సు కొరకు ఎక్కువ రుసుము వసూలు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏరోజు రిపోర్టు ఆ రోజు సాయంత్రం లోగా నిర్ణీత ప్రొఫార్మాలో నివేదికలు సమర్పించాలని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం తిరిగి నాలుగు నెలలకోసారి నిర్వహించడం జరుగుతుందని, ప్రభుత్వ పథకాలను పొందేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. మండల స్పెషల్ ఆఫీసర్లు రేపు జరుగబోయే గ్రామ సభలకు సంబంధించిన ఏర్పాట్లను ముందు రోజే వెళ్లి పరిశీలించుకోవాలని, సాఫీగా దరఖాస్తులు స్వీకరించేలా ఏర్పాట్లను పర్యవేక్షించాలని, టామ్ టామ్, ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజలకు తెలిసేలా కార్యాచరణ ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టరు ఏ.భాస్కరరావు, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు జి.వీరారెడ్డి, భవనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, జిల్లా పరిషత్ సిఇఓ కృష్ణారెడ్డి, అసిస్టెంట్ పోలీసు కమీషనర్ వెంకటరెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# నీల యాదయ్య మరణం టీడీపీ కి తీరని లోటు

**– నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**

**– కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.20000/– ఆర్థిక సహాయం**





రామన్నపేట, డిసెంబర్ 27(తీన్మార్ న్యూస్): రామన్నపేట టీడీపీ మండల అధ్యక్షులు నీల యాదయ్య మరణం పార్టీకి తీరని లోటని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన నీల యాదయ్య గుండెపోటుతో మరణించడంతో విషయం తెలుసుకున్న నకిరెకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం వారి స్వగ్రామానికి విచ్చేసి, కుటుంబ సభ్యుల ఓదార్చి రూ.20000/– రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. వీరితోపాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, గంగుల వెంకటరాజా రెడ్డి, జిల్లా నాయకులు జినుకల ప్రభాకర్, బత్తుల కృష్ణ గౌడ్, పున్న జగన్మోహన్, ఎంపీటీసీ మాదూరి జ్యోతి రామచంద్ర రావు, ఎండీ రెహన్, గోదాసు పృథ్వీరాజ్, నిదానపల్లి సర్పంచ్ గుత్త నర్సిరెడ్డి, కొత్తగూడెం సర్పంచ్ చిల్లర కైలాసం, రామని రమేష్, ఎండీ.అక్రమ్, కూనూరు కృష్ణ గౌడ్, సాల్వేరు లింగం, తదితరనాయకులు, కార్యకర్తలు, అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాపాలనపై గ్రామపంచాయతీ వారిగా ప్రోగ్రామ్ నిర్వహణ

రామన్నపేట, డిసెంబర్ 27(తీన్మార్ న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల విధానంపై ప్రజాపాలన కార్యక్రమంలో ఈనెల డిసెంబర్ 28 నుండి జనవరి 06 తేదీ వరకు గ్రామపంచాయతీ వారిగా ప్రోగ్రాం నిర్వహించ జరుగుతుందని ఎంపిడిఓ జి.జలేందర్ రెడ్డి మరియు తహశీల్దార్ లాల్ బహదూర్ లు ఒక ప్రకటన తెలియ జేశారు.

ఈ కార్యక్రమంలో 06 గ్యారంటీలకు సంబంధించి నిర్ణీత దరఖాస్తులు స్వీకరించబడునని, ఈ కార్యక్రమంలో తాహశీల్దార్ మరియు ఎంపీడీవో రెండు టీమ్ లుగా ఏర్పడి గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద కౌంటర్లు ఏర్పాటు చేసిన కౌంటర్ లలో దరఖాస్తులు స్వీకరించ బడుతుందని, ఈ దరఖాస్తులు ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మరియు మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల వారీగా కార్యక్రమం నిర్వహించబడుతుందని, ప్రతి ఇంటికి ఒక దరఖాస్తు చొప్పున సేకరించబడుతుందని, దరఖాస్తు ఫారం ను ప్రతి ఇంటికి పంచాయతీ కార్యదర్శి ద్వారా సరఫరా చేయ బడుతుందని, దరఖాస్తులలో వారికి కావలసిన ప్రభుత్వ పథకాన్ని ఎంచుకొని అట్టి దరఖాస్తులు నింపి వారి రేషన్ కార్డు నెంబరు, ఆధార్ కార్డ్ నెంబర్ రాసి, వాటిని జీరాక్స్ కాఫీ ను జత చేసి, సంతకం చేసి గ్రామపంచాయతీ వద్ద ఉన్నటువంటి ప్రజాపాలన టీమ్




కి అందజేయగలరని, వచ్చిన దరఖాస్తులను రిజిస్టర్ లో నమోదు చేసి, కంప్యూటరీకరణ చేసి, పై అధికారులకి అందజేయడం జరుగు తుందని, గ్రామపంచాయతీ వారీగా షెడ్యూల్ ను ఈ క్రింది విధంగా వెల్లడించారు.

డిసెంబర్ 28 సూరారం, బాచుప్పల, నిదానపల్లి, బోగారం గ్రామాలు
డిసెంబర్ 29 వెల్లంకి, సిరిపురం గ్రామాలు
డిసెంబర్ 30 తుమ్మలగూడెం, రామన్నపేట గ్రామాలు
జనవరి 02 లక్ష్మాపురం, కొత్తగూడెం, మునిపంపుల, దుబ్బాక గ్రామాలు
జనవరి 03 కక్కిరేణి, ఎన్నారం, శోభనాద్రిపురం, నీర్నెంల గ్రామాలు
జనవరి 04 కొమ్మాయిగూడెం, సర్నేనిగూడెం, జనంపల్లి, ఉత్తటూరు గ్రామాలు
జనవరి 05 బి.తుర్కపల్లి, కుంకుడుపాముల గ్రామాలు
జనవరి 06 పల్లివాడ, ఇస్కిల్ల గ్రామాలలో తేదీల వారీగా కౌంటర్ లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు.

# విద్యార్థుల పక్షాన ప్రశ్నించే గొంతుక ఎస్ఎఫ్ఐ

**– జిల్లా కార్యదర్శి వనం రాజు**




రామన్నపేట, డిసెంబర్ 27(తీన్మార్ న్యూస్): భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ విద్యార్థుల పక్షాన ప్రశ్నించే గొంతుక అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు అన్నారు. బుధవారం రామన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యవిధానాన్ని తీసుకొచ్చి పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తుందని అన్నారు. ప్రవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తూ విద్యలో కాషాయి కరణ పులిమి లౌకికత్వన్ని, శాస్త్రీయ ఆలోచనలని దెబ్బతిస్తుందని అన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులను చిన్నచూపు చూసి ప్రభుత్వాన్ని కూలగొట్టుకుందని ఇటీవల ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం కూడ విద్యపట్ల నిర్లక్ష్యం వహిస్తే కులాకతప్పదని హెచ్చరించారు. అలాగే ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాలు ఈ నెల 28,29,30 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు మేకల జలేందర్, మండల నాయకులు పుట్టల ఉదయ్, కంబాల పల్లి సాయి కుమార్, మేకల శివ, కల్లూరి శివ, తదితరులు పాల్గొన్నారు.

# అంబులెన్సున్నా ప్రైవేటు వాహనమే దిక్కు




భైంసా : ప్రాణాపాయంలో ఉన్న రోగులను తరలించేందుకు ఉపయోగించే అంబులెన్సు చోదకుడు అందుబాటులో లేకపోవడంతో రోగి బంధువులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గత్యతరం లేక ప్రైవేటు అంబులెన్స్‌ను ఉపయోగించుకున్న ఘటన భైంసాలో చోటుచేసుకుంది. భైంసా సమీపంలో చోటుచేసుకున్న ఓ రోడ్డు ప్రమాదంలో లక్ష్మణ్‌గౌడ్ అనే వ్యక్తి తీవ్రగాయాపాలుకాగా 108 వాహన సిబ్బంది తక్షణం స్పందించి భైంసా ప్రాంతీయాసుపత్రిలో చేర్పించారు. తలకు తీవ్రగాయాలై అపస్మారకస్థితిలో ఉన్న అతడికి విధి నిర్వహణలో ఉన్న డా.అనిల్ జాదవ్ వైద్యం అందించారు. అయితే అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ తీసుకెళ్లమని సూచించారు. ఆసుపత్రి ఆవరణలో ప్రభుత్వ ఆసుపత్రి అంబులెన్స్ అందుబాటులో ఉన్నా సంబంధిత చోదకుడి జాడ కనిపించలేదు. వైద్యుడు, సిబ్బంది, బాధిత కుటుంబ సభ్యులు సుమారు గంటన్నరపాటు అతడి కోసం వేచి చూశారు. రోగి పరిస్థితి మరింత దిగజారడంతో గత్యంతరం లేక క్షతగాత్రుడి బంధువుల లక్ష్మణ్‌గౌడ్‌ను ప్రైవేటు అంబులెన్స్‌లో నిజామాబాద్ తరలించారు.

ఈ విషయమై సంబంధిత వాహన చోదకుడు సుభాష్‌ను చరవాణిలో వివరణ కోరగా తాను అసుపత్రిలోలోనే ఉన్నానని, అంబులెన్స్ వద్ద కూర్చున్నానని, తనకు ఎవరూ చెప్పలేదని, భోజనానికి వెళ్లానని ఇలా పలు రకాల సమాధానం చెప్పడం గమనార్హం.

భైంసా ప్రాంతీయాసుపత్రి అంబులెన్స్ ఇటీవల చెడిపోవడంతో ఇక్కడి అత్యవసర పరిస్థితుల దృష్ట్యా తాత్కాలికంగా బాసర పీహెచ్‌సీ అంబులెన్స్ ను అందుబాటులో ఉంచాం. దానిని నిర్వహణకు ఇద్దరు చోదకులు ఉన్నారు. ఒకరు నిరంతరం విధి నిర్వహణలో అందుబాటులో ఉండాలి. ఈ విషయమై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటాం.

# వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి





నేరేడుచర్ల, డిసెంబర్ 27(తీన్మార్ న్యూస్): వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణల కోసం విద్యార్థులు నిత్య పరిశోధనలు చేపట్టాలని కెవికె శాస్త్రవేత్త దొంగరి నరేష్ అన్నారు. బుధవారం ఆయన నేరేడుచర్ల లోని శ్రీ అంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్ర వ్యవసాయ సందర్శన లో భాగంగా మాట్లాడారు. విద్యార్థులు చదువులో భాగంగా నూతన ఆవిష్కరణలను కనిపెట్టేందుకు ప్రయత్నాలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కృషి విజ్ఞాన కేంద్రంలో వర్మి కంపోస్ట్ తయారీ విధానం మొక్కల పెంపకం, ఇరిగేషన్ పద్ధతులు, డ్రిప్ సిస్టం వరి సాగులో చీడపీడలతో సస్యరక్షణ చర్యలు, చేపట్టడానికి దీపపు కాంతుల విధానం, వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎ.సైదిరెడ్డి ఉపాధ్యాయులు నాగ ప్రసాద్, యాకూబ్ నాగరాజు, ఆదినారాయణ, రవీందర్ రెడ్డి, రాము, తదితరులు పాల్గొన్నారు.

# తెదేపా నాయకుల బ్యానర్ల దహనం



నగరి:నగరి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద తెదేపా ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, నియోజకవర్గ బాధ్యుడు గాలి భానుప్రకాశ్ ఫ్లెక్సీలతో వైకాపా నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ఇరువురు నాయకుల ఫ్లెక్సీలను వైకాపా మహిళలు చీపుర్లు, చెప్పులతో కొట్టి వాటిని దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. మంత్రి రోజా ఇంటి వద్దకు తెదేపా మహిళలు చీర, సారెతో వచ్చి అవమానపరిచారంటూ.. ఇందుకు ప్రతిగా తెదేపా నాయకులను (ఫ్లెక్సీలతో) అవమానం చేస్తున్నట్లు వైకాపా నాయకులు పేర్కొన్నారు. మంత్రి రోజా ధైర్యంగా సవాల్ విసిరితే, అందుకు బదు లుగా తెలుగు మహిళలు మంత్రి ఇంటి వద్దకు రావడమేంటని విమర్శించారు. ఇలాంటి చర్యలు మరో సారి జరిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందంటూ వారు నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం, నగరి, పుత్తూరు మున్సిపల్ వైస్ ఛైర్మన్లు బాలన్, శంకర్, జయప్రకాష్, ఎంపీపీలు భార్గవి, మునివేలు, దీప, వైకాపా జిల్లా కార్యదర్శి మేరి, కౌన్సిలర్లు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


# సుస్థిర ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత



రాజమహేంద్రవరం:సుస్థిర ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సుస్థిర ఆరోగ్య అభివృద్ధి లక్ష్యాల అంశాలపై జాయింట్ కలెక్టర్ తేజ్ భర త్‌తో కలిసి కలెక్టర్ విద్య, వైద్య మహిళా సంక్షేమ అధికారులతో సమీక్షించారు.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 12,204 మంది గర్భిణులను గుర్తించామన్నారు. వీరికి రక్తహీనత లేకుండా పౌష్టికాహారాన్ని అందిస్తూ ప్రత్యేమైన చర్యలు చేపట్టాలని స్త్రీ, శిశుసంక్షేమం, వైద్యాధికారులను ఆదేశించారు. గర్భధారణ సమయంలో, పెరుగుతున్న పిండానికి, అలాగే తల్లికి తగినన్ని పోషకాలను, ఆక్సిజన్ అందించడానికి అనుగుణంగా అధిక స్థాయిలో రక్త ఉత్పత్తి అవసరం అన్నారు. గర్భధారణ సమయంలో తక్కువ స్థాయిలో హిమోగ్లోబిన్ 11 శాతంకు కంటే తక్కువ ఉండకుండా పోషక విలువులు ఉన్నా మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. జిల్లాలో తగిన వయస్సు కంటే బరువు తక్కువుగా ఉన్నవారు 2,760 మందిని, కుంగిపోయిన పిల్లలు 4,585 మంది గుర్తించమన్నారు. వీరిలో తీవ్ర అనిమియ లోపం కలిగిన వారికి వైయస్ఆర్ ప్రత్యేక పోషకతతో కూడిన పౌష్టికాహారం అందించాలన్నారు. అదేవిధంగా ప్రతి మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ద్వారా వైద్యులు ప్రతి నెలా పరీక్షలు నిర్వహించి వారికి ఎటువంటి పోషకారాన్ని అందించాలో సూచించాలన్నారు.

# అక్రమాలు మితిమీరాయి

## - తనిఖీ కేంద్రాలు పూజ్యం



పలమనేరు:అనంతపురం, పుంగనూరు నుంచి పలమనేరు మీదుగా అనుమతి ఉన్నవి, లేనివి చెన్నైకి రవాణా చేస్తున్నారు. మూడేళ్ల క్రితం గ్రానైట్ లారీ వస్తే తనిఖీ కేంద్రాల వద్ద సోదా చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. అంతా ఎక్కడో ఒకచోట సర్దుబాటు చేసి లారీలను దర్జాగా తరలిస్తున్నారు. కొన్నిచోట్ల అనుమతి ఉన్నా.. లీజు పీరియడ్ అయిపోయినా క్వారీ తవ్వకాలు కొనసాగుతున్నాయి. అధికారులు క్వారీ రాళ్లను అక్రమంగా తరలించే వాహనాలను తనిఖీ చేయడానికి ప్రత్యే కంగా తనిఖీ కేంద్రాలు లేవు. సాధారణంగా అటవీశాఖ, ఆర్టీవో విభాగాల అధికారుల చెక్‌పోస్టులు ఉన్నాయి. భూగర్భ గనుల శాఖ అధికారులు ఈ చెక్‌పోస్టుల్లోనే ఒకచోట కూర్చుని తనిఖీలు చేయాల్సిన పరిస్థితి. అలా పుంగనూరులో అటవీశాఖ వారు ఓ తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అందులోనే మైన్స్ అధికారులు ఉండేవారు. బైపాస్ రావడంతో అదీ మూతపడింది. దాంతో వీరు తనిఖీలు చేయడానికి స్థలమంటూ లేకపోయింది. దాంతో అక్రమాలకు అడ్డులేకుండా పోయింది. రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు కుప్పంలోని క్వారీ అక్రమాలపై ఇటీవల ఏపీ, తమిళనాడు రాష్ట్రాల సీఎస్‌లకు లేఖ రాశారు. అయినా దానిపై ఎలాంటి స్పందన లేదు. అధికారులు తాము నిఘా పెంచామని తూతూ మంత్రంగా జరిమానాలు వేసి చేతులు దులుపుకొంటున్నారు. కుప్పం ప్రాంతంలో 40 క్వారీలను సీజ్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మొబైల్ పార్టీలు తిరుగుతూ నిఘా పెంచుతున్నామని అంటారు. కానీ రోజూ పలమనేరు మీదుగా లారీలు తమిళనాడుకు తరలిపోతుంటాయి. ఇక లారీలో నిబంధనలకు విరుద్ధంగా రాళ్లను లోడ్ చేసి తరలిస్తుంటారు. రెండు నెలల క్రితం లారీలో మితిమీరిన బరువు ఉండటంతో రాష్ట్ర సరిహద్దులోని సామసేనుమిట్ట వద్ద లారీ పక్కకు వాలింది. దానిపై ఎలాంటి కేసు నమోదు కాకపోవడం గమనార్హం. ఇప్పుడు అధికార పార్టీ అండదండలు ఉంటే తప్పా క్వారీ నిర్వహణకు వీల్లేదు. అనుమతుల సమయంలో రెవెన్యూ సిబ్బంది సరైన సర్వేలు చేయకుండా లీజు తీసుకున్న వ్యక్తి ఎక్కడ చెబితే అక్కడ కొలతలు వేసి భూమి అప్పగిస్తున్నారు. ఒకప్పుడు జిల్లా వ్యాప్తంగా 500 క్వారీలు ఉండేవి. కొన్ని మూతపడగా ప్రస్తుతం 300 వరకు మిగిలాయి. రాయిని ఇతర దేశాలకు ఎగుమతి చేయడం తగ్గింది. దాంతో అక్రమ రవాణా కూడా పెద్దగా లేదు. ఇతర శాఖల చెక్‌పోస్టుల్లోనే ఉండి మేము తనిఖీలు చేస్తుంటాం. ఇంకా మొబైల్ బృందాలు కూడా ఉన్నాయి. ఒక నెలలో 14 కేసులు నమోదు చేశాం. రూ.7 లక్షల వరకు అపరాధం వసూలు చేశాం.

# ఇళ్లెక్కడ.. ఇంకెప్పుడు..?



రాజమహేంద్రవరం :పేదల ఇళ్ల నిర్మాణాన్ని నవరత్నాల్లో భాగంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నా.. నిర్మాణాల్లో ఆశించిన కదలిక లేదు. నిర్మాణ వ్యయం పెరిగిన వేళ.. కనీసం రూ.3.5 లక్షలు ఇస్తే తప్ప సొంతింటి కల నిజమయ్యేలా లేదు. దీంతో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు.. డ్వాక్రా రుణాల కింద రూ.35 వేలు ఇస్తాం.. ముందుకు రండని అవగాహన కల్పిస్తున్నా లబ్ధిదారులు సాహసించడం లేదు. 2020 డిసెంబరులో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపనకు సర్కారు శ్రీకారం చుట్టినా.. నేటికీ నిర్మాణాలు కొలిక్కి రాలేదు. ఈ ఉగాది నాటికైనా కొన్ని నిర్మాణాలు పూర్తిచేసి గృహప్రవేశాలు జరిగేలా చూస్తే అదే పది వేలని లక్ష్యాలు నిర్దేశించుకున్నారు. ఈ లక్ష్యాలు చేరుకోడానికి ఆపసోపాలు పడాల్సివస్తోంది. మౌలిక వసతుల లేమి, ఇతర ప్రతికూల పరిస్థితులు అధిగమిస్తేనే సొంతింటి కల సాకారానికి అడుగులు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. జియో ట్యాగింగ్ జరిగితే పథకం పట్టాలెక్కి నట్లే అని లెక్కలు చూపుతున్నా.. క్షేత్రంలో నిర్మాణాలు ఆశించిన స్థాయిలో లేవు. హెచ్చుసంఖ్యలో పునాది స్థాయిలోపే.. గోతులు తవ్వి వదిలేసినవి.. ఆ పనులు సైతం ప్రారంభించనివే ఉన్నాయి. కాకినాడ జిల్లాలో బీబీఎల్ స్థాయిలో 40,821 ఉన్నాయి. కాలనీల్లో రూ.32.70 కోట్లతో నీటి సౌకర్యాలు, రూ.9.12 కోట్లతో అప్రోచ్ రోడ్డు, అంతర్గత రహదారులు, కల్వర్టు పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. 373 కాలనీలకు విద్యుత్తు సరఫరాకు రూ.219 కోట్లతో ఓవర్‌హెడ్ లైన్స్ నెట్‌వర్క్ అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు. 7,548 గృహాలకు విద్యుత్తు.. 7,609 ఇళ్లకు నీటి వసతి కల్పించామనేది అధికారిక లెక్క. తూర్పుగోదావరి జిల్లాలో 1.46 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తే.. తొలిగా పూర్తయిన నిర్మాణాలు 15 వేల లోపే. రెండేళ్లు గడుస్తున్నా.. పునాది స్థాయిలోపు (బీబీఎల్) నిర్మాణాలు 27,371 ఉన్నాయి. 7,018 ఇళ్లకు విద్యుత్తు.. 7,371 గృహాలకు నీరిచ్చినట్లు చూపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 243 కాలనీల్లో గృహ నిర్మాణం చేపట్టాలన్నది లక్ష్యం. తొలిగా 25,026 మందికి పీఎంఏవై – వైఎస్సార్ పట్టణ పథకం ద్వారా, గ్రామీణ పథకం కింద 9,238 ఇళ్లు కట్టాలన్నది లక్ష్యం. ఇక్కడ బీబీఎల్ స్థాయిలో ఏకంగా 11,164 గృహాలు ఉన్నాయి. 2,872 ఇళ్లకు విద్యుత్తు, 3,006 ఇళ్లకు తాగునీరిచ్చామని తెలిపారు. విద్యుత్తు స్తంభాలు, పైపులైన్లు, రోడ్ల సమస్య చాలాచోట్ల వేధిస్తోంది. అయిదు బోర్లు వేసి.. దారులు చూపినా.. డ్రెయినేజీ, విద్యుత్తు పూర్తిగా లేదు. రాజమహేంద్రవరం పేదలకు స్థలం ఇవ్వగా దూరమని వారు రావడం లేదు. కట్టకపోతే రద్దనే భయంతో కొందరు పునాదులు తవ్వారు.

# ఇంటింటికీ శుద్ధజలం పనుల్లో తీవ్ర జాప్యం



గూడూరు:తెదేపా హయాంలో పెద్దఎత్తున నిధులు కేటాయించగా గడువు మీద గడువులు ఇస్తున్నా పనులు కొలిక్కి రావడం లేదు. పెండింగ్ బిల్లులు.. స్థల సమస్యలు వెరసి నాలుగేళ్లయినా 50 శాతం మించి పూర్తికాలేదు. ఈ ఏడాది మార్చి ఆఖరుతో గడువు పూర్తికానుండగా ముగించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని ప్రధాన పట్టణాలైన నాయుడుపేట, సూళ్లూరుపేట, పుత్తూరు దాహార్తి తీర్చడానికి గత తెదేపా ప్రభుత్వం రూ.468.25 కోట్లు కేటాయించింది. అప్పట్లోనే నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణాలకు రూ.56 కోట్ల మేర నిధులు విడుదలయ్యాయి. ఆసియా ఇన్‌ఫ్రా, ఇన్‌వెస్ట్‌మెంట్ బ్యాంకు ద్వారా నిధులు కేటాయించగా కండలేరు నుంచి నీటిని అందించడం లక్ష్యం. వైకాపా అధికారంలోకి వచ్చాక పనులు రెండేళ్లపాటు పక్కన పెట్టేశారు. అనంతరం మొదలైనా ప్రధాన గొట్టపు మార్గాల పనులు 80%, పట్టణాల్లో పంపిణీ వ్యవస్థ పనులు 50% వరకు మాత్రమే పూర్తిచేశారు. రిజర్వాయర్ల పనుల్లో ఆరంభ శూరత్వమే : కండలేరు నుంచి రెండు పట్టణాలకు శుద్ధజలం ఇవ్వాల్సి ఉంది. ఇందుకు నాయుడుపేట పట్టణంలోని జువ్వపాళెం.. సూళ్లూరుపేట మండలం మంగళంపాడు వద్ద ఎస్‌ఎస్ ట్యాంకులు నిర్మించాల్సి ఉంది. సింగమాల నుంచి జువ్వపాళెం వరకు గొట్టపు మార్గం పనులు దాదాపు పూర్తిచేశారు. పట్టణంలో మూడుచోట్ల ఓహెచ్‌ఎస్‌ఆర్ పనులు జరుగుతున్నాయి. తుమ్మూరులో నిర్మించాల్సిన ట్యాంకుకు నిధులు సరిపోయే పరిస్థితి లేదు. మంగళంపాడు వద్ద ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణం పూర్తిచేయాల్సి ఉంది. ప్రధానవనరు నుంచి గొట్టపు మార్గాల పనులు పూర్తికాగా పట్టణంలో పంపిణీ వ్యవస్థ పనులు చేస్తున్నారు. ఓహెచ్‌ఎస్‌ఆర్ నాలుగుచోట్ల నిర్మించాల్సి ఉండగా రెండుచోట్ల పనులు జరుగుతున్నాయి. మరో రెండుచోట్ల ప్రారంభించాల్సి ఉంది. ఈ పథకాలకు సంబంధించి రూ.40 కోట్ల బకాయిలు ఉన్నట్లు సమాచారం. బిల్లులు ఆలస్యం అవుతున్నా నేతల ఒత్తిడితో ఏడాదిగా పనులు చేస్తున్నారు. ఇప్పటికే రెండు దఫాలు గడువు పొడిగించగా మరో ఏడాది పొడిగించినా పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. రెండు రిజర్వాయర్ల పనులకు మట్టి నమూనాలు ప్రస్తుతం అందులో నీరుండటంతో ఆలస్యం కానున్నాయి. పట్టణాల్లో తాగునీటి పనులు ఎక్కడా ఆగలేదు. సమాంతరంగా జరుగుతున్నాయి. రిజర్వాయర్ల నిర్మాణానికి సంబంధించిన పనులు త్వరలో మొదులుపెడతాం. రెండుచోట్లా ఓహెచ్‌ఎస్‌ఆర్‌లు ప్రారంభించాల్సి ఉంది.

# ధాన్యం కొనుగోళ్లలో దళారులతో కుమ్మక్కు..!



కాకినాడ : ధాన్యం అమ్మి రెండు నెలలు సమీపిస్తున్నా.. రైతుల బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమ కాలేదు. రైతు భరోసా కేంద్రంలో ధాన్యం నమూనాలు చూపి, నిబంధనల ప్రకారం విక్రయించినా.. ఎందుకు జాప్యమ వుతుందో తెలియక రైతులు ఆర్బీకేల చుట్టూ తిరుగుతున్నారు. దీనిపై రైతులు గట్టిగా నిలదీస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సేకరించిన ధాన్యానికి ఆర్బీకేలో ఎఫ్‌టీవో నంబర్లు జారీ చేయలేదు.. ఇదేమని ప్రశ్నిస్తే దళారీ దగ్గరకు వెళ్లాలని ఆర్బీకేలోని సాంకేతిక సిబ్బంది సమాధానమిచ్చారు. అతని వద్దకు వెళ్తే.. కాలయాపన చేస్తున్నా ఖాతాల్లో డబ్బులు పడడంలేదు. ఆర్బీకేల ద్వారా సేకరించిన ధాన్యానికి ఎఫ్‌టీవో నంబర్లు జారీ చేయని విషయం జిల్లా పౌరసరఫరాల సంస్థ కార్యాలయానికి చేరింది. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని సంబంధిత శాఖ అధికారిని ఆదేశించారు. తాళ్లరేవు మండలం, చొల్లంగి ఆర్బీకే పరిధిలో ఆరుగురు రైతులు 2022, డిసెంబరులో సు మారు 10 టన్నుల ధాన్యాన్ని విక్రయించారు. వీరంతా నిబంధనల ప్రకారం మిల్లుకు తరలిం చారు. ఒక్కో రైతు ఎంత మొత్తంలో ధాన్యాన్ని విక్రయించారో వేర్వేరుగా ఎఫ్‌టీవో జారీ చేయాలి. ఇప్పటికీ ఈ ప్రక్రియ జరగలేదు. అసలు ధాన్యం తరలించిన వాహనాలకు ట్రక్ షీట్ తయారు చేశారా? ఈ ధాన్యం సీఎంఆర్‌కు నిర్దేశించిన మిల్లుకు వెళ్లిందా... అలా జరిగితే ఎఫ్‌టీవో ఎందుకు జారీ చేయలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ రైతుల నుంచి ఆర్బీకే సిబ్బంది ధాన్యం సేకరించారని చెబుతున్నా... మధ్యవర్తి ద్వారా వీటిని కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. దళారీ, ఆర్బీకే సిబ్బంది కుమ్మక్కై ఇప్పటికీ రైతులకు ఎఫ్‌టీవోలు జారీ చేయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే నెలలో విక్రయించిన ఇతర రైతుల ఖాతాల్లో డబ్బులు జమకావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఖరీఫ్‌లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినా కొన్ని చోట్ల సిబ్బంది, దళారులు కుమ్మక్కై చేతివాటం ప్రదర్శిస్తున్నారు. క్షేత్రస్థాయిలో కస్టోడియన్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ పరిస్థితి నెలకొందని పౌరసరఫరాల సంస్థ అధికారులే చెబుతున్నారు. చొల్లంగి ఆర్బీకే ద్వారా 2022, డిసెంబరు 20న 75 కిలోల చొప్పున 32 ధాన్యం బస్తాలను అమ్మాను. జట్టుకు కూలీ ఇవ్వాలని రూ.3 వేలు వసూలు చేశారు. ఇప్పటి వరకు నా ధాన్యం సొమ్ములు జమ చేయలేదు. ఇదేంటని సాంకేతిక సహాయకుణ్ని అడిగితే మధ్యవర్తిని కలవాలని సూచించారు. ఆయన్ను అడిగితే డబ్బులు ఇస్తామని తిప్పుతున్నారు. టెక్నికల్ అసిస్టెంట్‌కు ఆధార్‌కార్డు, సీసీఆర్‌సీ కార్డు, బ్యాంకు ఖాతా నకళ్లను అందజేశాను. ఇతర రైతులకు డబ్బులు జమ కావడంతో ఎఫ్‌టీవో నంబరు అయినా ఇవ్వాలని కోరితే.. ఇప్పటికీ చెప్పలేదు. నేను కౌలు రైతుని. అప్పు చేసి సాగు చేశాను. నాకు న్యాయం చేయండి.


# కలవరపెడుతున్న వైరస్

## - ఎక్కడికక్కడ పందుల మృతి



ధవళేశ్వరం:తూర్పుగోదావరి జిల్లాలోని బొమ్మూరు, ధవళేశ్వరం, కడియం పంచాయతీల పరిధిలో వైరస్ సోకడంతో పదుల సంఖ్యలో పందులు మృత్యువాత పడుతున్నాయి. ధవళేశ్వరం, బొమ్మూరు పంచాయతీల్లో ఆ సంఖ్య రోజుకు 30 నుంచి 40గా ఉందని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. దీంతో పందుల కళేబరాల నుంచి నమూనాలు సేకరించిన పశుసంవర్ధక శాఖ అధికారులు పరిశీలనకు పంపించారు. వీటి మృతికి స్వైన్ ఫీవర్ వైరస్ కారణమని నిర్ధారణకు వచ్చారు. వ్యాధి సోకిన పందులు నిమిషాల వ్యవధిలోనే మృతి చెందుతున్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు టీకాలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. పందులకు టీకాల కోసం పెంపకందార్లు స్థానిక పశువైద్యులను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. వ్యాధి లక్షణాలు: పందుల శరీర ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో పెరగుతుంది. జ్వరాన్ని తట్టుకోలేక ఫిట్స్‌కు గురవుతాయి. తర్వాత కొద్ది సమయానికి మరణిస్తాయి.కళేబరాలతో ఇబ్బందుల్లు: కళేబరాలను రహదారుల చెంతన, మురుగు కాలువల్లో పడేస్తున్నారని ధవళేశ్వరం పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబు పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో కళేబరాలు పడేయడం వల్ల ఇతర జీవాలకు సోకే ప్రమాదం ఉందన్నారు. రోజువారీ పారిశుద్ధ్య పనులతోపాటు నిత్యం పదుల సంఖ్యలో చనిపోతున్న పందులను తరలించి పూడ్చిపెట్టడం ఇబ్బందిగా మారిందని పంచాయతీ సిబ్బంది వాపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఈ వ్యాధిని కనుగొన్నారు. ప్రధానంగా పశ్చిమగోదావరి, కోనసీమ జిల్లాల్లో వ్యాప్తి అధికంగా ఉంది. ఇప్పటికే సీతానగరం, కోరుకొండ తదితర మండలాల్లో టీకాల కార్యక్రమాన్ని వేగవంతం చేశాం. కడియంలోని ఓ పెంపకందారుడి పందుల నుంచి రక్త నమూనాలను సేకరించి వైరస్‌ను నిర్ధారించాం. అతడికి చెందిన సుమారు 20 పందుల ఒకేసారి మృత్యువాత పడ్డాయి.

# కొత్తరకం కలుపుతో అనర్థమే!




నందిగామ, : అన్నదాతను కలవరపెడుతున్న కొత్తరకం కలుపు మొక్కలపై ఆంధ్రజ్యోతి కథనానికి శాస్త్రవేత్తలు స్పందించారు. ఎన్టీఆర్ జిల్లాలోని పలు మండలాలలో విస్తారంగా వ్యాప్తి చెందుతున్న కలుపు మొక్కలను లామ్, కేవీకే శాస్త్రవేత్తలు పరిశీలించారు. నందిగామ మండలం జొన్నలగడ్డ పరిసర ప్రాంతాలలో శాస్త్రవేత్తలు పర్యటించి కలుపు మొక్కలను నిశితంగా పరిశీలించారు. కృషీ విజ్ఞాన కేంద్రం గరికపాడుకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ పి.వెంకటసుబ్బయ్య తన బృందంతో మొక్కల పరిశీలన అనంతరం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఎజిడేటమ్ కొనజైజీస్ అనే ఈరకం మొక్క అస్టజేసీ జాతికి చెందినదిగా ప్రాథమికంగా నిర్ధారణ చేశారు. ఈ మొక్కకు వేగంగా వ్యాప్తి చెందే లక్షణం ఉందని, ఇది మెక్సికో నుంచి అలంకరణ మొక్కగా మనదేశానికి దిగుమతి అయినట్టు చెప్పారు. ఆ దేశంలో ఈమొక్కను మెక్సికన్ డెవిల్ అని పిలుస్తారని చెప్పారు. గుర్రపు డెక్క కూడా అప్పట్లో అలంకరణ మొక్కగానే ఇండియాకు వచ్చిందని, నేడు ఆ మొక్కలు రైతులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నాయన్నారు. ఈ మొక్కలు దట్టంగా గుబురుగా పెరగడం వల్ల భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. దీని వేరు భూమికి సమాంతరంగా ఉండి విశాలంగా వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఈ మొక్కల కొమ్మలు కూడా మొలకెత్తుతాయని చెప్పారు. దీని వల్ల గట్ల వెంట పశువుల మేత దెబ్బతింటుందన్నారు. గుర్రపుడెక్క, వయ్యారిభామ, పిచ్చిబెండ మొక్కల విషయంలో రైతులు ఎలా జాగ్రత్తలు తీసుకుంటారో అదే తీరున ఈ మొక్క పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొక్కదశలోనే నివారణ చర్యలు చేపట్టాలని, దీని నివారణకు 2, 4డి సోడియం సాల్ట్ లేదా 2, 4డి అమ్మోనియం సాల్ట్‌ను పిచికారీ చేయాలని సూచించారు. లీటరు నీటికి పది మిల్లీలీటర్లు మందు కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ మందులు పిచికారీ చేయాలంటే మూడు కిలోమీటర్ల మేర పత్తి పంట ఉండ కూడదని, ఈ మందు పిచికారీ చేస్తే పత్తి పంట పూర్తిగా దెబ్బతింటుంది కనుక రైతులు జాగ్రత్త వహించాలని సూచించారు. మొక్క వ్యాప్తి నివారణకు రైతులు కనీసం మూడు సంవత్సరాలు మొక్కదశలోనే చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. మొక్క నివారణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పీఎన్ శివప్రసాద్, డాక్టర్ ఆర్.ప్రభావతి, మన్నెం రాజనరసింహ తదితరులు పాల్గొన్నారు.

# రోగాలు పీడిస్తున్నాయ్!



సత్తెనపల్లి :సత్తెనపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఒక విద్యార్థినికి ఆటలమ్మ ఇన్‌ఫెక్షన్ సోకింది. అదే తరగతి గదిలోని మరో ఐదుగురికి కూడా సోకడంతో పాఠశాలకు దూరమయ్యారు. నర సరావుపేటలోని ఓ పాఠశాలలో పదుల సంఖ్యలో ఇన్‌ఫెక్షన్‌కు బాధితులయ్యారు. చిలకలూరిపేటకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి కుటుంబం ఇటీవలే వివాహానికి దూర ప్రాంతానికి వెళ్లి వచ్చింది. ఆ తరువాత భార్యాభర్తకు జలుబు, దగ్గు ఆ తరువాత జ్వరం రాగా, రెండ్రోజులకే ఇంట్లోని ముగ్గురు పిల్లలకు సోకింది. ఇలా వేలాది కుటుంబాలు జ్వరం, జలుబు, దగ్గులాంటి సమస్యలతో బాధప డుతున్నాయి. వేసవిని తలపించేలా పగటి పూట ఎండలు మండిపోతున్నాయి.. రాత్రయితే చలిగాలులు వీస్తున్నాయి.. ఈ విభిన్న వాతావరణం పిల్లల్లో కల్లోలం రేపుతోంది. చలికాలం పోయి వేసవి వచ్చే ముందు వాతావరణ మార్పులతో వ్యాధుల వ్యాప్తి సర్వసాధారణం. అయితే ఎప్పుడూ ప్రబలే వ్యాధులు కాకుండా కాలానుగుణ సీజన్‌లో ఎలాంటి అనారోగ్య సమస్యలు పిల్లల్లో వస్తాయో ఇప్పుడు అవి కనిపిస్తుండటం పెద్దల్లో ఆందోళన రేపుతోంది. వాతావరణంలో మార్పులకుతోడు దోమల విజృంభణ పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. కలుషిత నీరు, ఆహారంతో అతిసారం బారినపడి విద్యార్థులు పాఠశాల లకు గైర్హాజరవుతున్నారు. జిల్లాలో గత పది రోజుల వ్యవధిలో కనిష్ఠ ఉష్ణోగ్రత 14 నుంచి 15 సెల్సియస్ డిగ్రీలుగా నమోదైంది. అదే గరిష్ఠ ఉష్ణోగ్రత 33 నుంచి 35 డిగ్రీలుగా నమోదైంది. అటు చల్లదనం.. ఇటు వెచ్చదనం రెండూ ఊహించని స్థాయిలో ఉండటమే పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీసే అంశంగా ఉంది. ఇలాంటి తరుణంలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నరసరావుపేట ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు అనారోగ్య సమస్యలతో రోజూ 70 నుంచి 90 మంది వరకు చిన్నారులు వస్తున్నారు. సత్తెనపల్లి ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు 40 నుంచి 50 మంది, చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి 40 నుంచి 60 మంది, వినుకొండకు 20 నుంచి 30 మంది, మాచర్ల, విజయపురిసౌత్ ఆసుపత్రులకు 20 మంది, అమరావతి, పెదకూరపాడు ఆసుపత్రులకు 15 నుంచి 25 మంది చిన్నారులు అనారోగ్య సమస్యలతో వస్తున్నారు. 2 జిల్లాలోని అన్ని పట్టణాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులు అనారోగ్య సమస్యలతో వచ్చే పిల్లలతో నిండుగా కనిపిస్తున్నాయి. ఒక్కో ఆసుపత్రికి రోజుకు 40 నుంచి 70 వరకు ఓపీ వస్తున్నట్లు ప్రైవేట్ వైద్యులు చెబుతున్నారు.

# ఆగని ఇసుక తవ్వకాలు



రేపల్లె, : తీర ప్రాంతంలో ఇసుక తవ్వకాలు ఆగడంలేదు. పత్రికల్లో కథనాలు వచ్చినా.. గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేసినా.. అధికారులకు ఫిర్యాదులు చేసినా అక్రమార్కులు అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు చేస్తూ రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది సమక్షంలోనే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. రేపల్లె మండలం మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయం సమీపంలో అధికార పార్టీకి చెందిన గ్రామ, మండల స్థాయి నాయకుడు వారం రోజులుగా డ్రెజ్జర్ల సహాయంతో ఇసుకను తోడుతున్నారు. తవ్విన ఇసుకను రెండు రోజుల నుంచి ఎక్స్‌కవేటర్ ద్వారా ట్రాక్టర్లలో నింపి తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరు రూ.6 వేలకు అమ్ముకుంటున్నట్లు సమాచారం. ఆలయానికి ప్రమాదం అని తెలిసినా మమ్మల్ని ఆపేది ఎవరంటూ రాత్రి పగలు తేడా లేకుండా ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఆలయ సమీపంలో అడ్డగోలుగా తవ్వకాలు జరుపుతుంటే ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోకపోవడం ఏమిటని భక్తులు మండిపడుతున్నారు. రెవెన్యూ, పోలీస్, కృష్ణా రివర్ అధికారులకు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు తెలిపారు. ఇసుక తవ్వకాల వద్ద ఉన్న వీఆర్వోలను ఆంధ్రజ్యోతి ప్రతినిధి ప్రశ్నిస్తే ఎస్టీ కాలనీకి తరలిస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని ఆర్డీవో పార్థసారథిని ప్రశ్నించగా ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులులేవని తహసీల్దార్‌కు చెప్పి నిలుపుదలచేయిస్తామని తెలిపారు. సీఐ విజయచంద్రకు ఫోన్ చేయగా తాను సెలవులో ఉన్నట్లు చెప్పారు. దీంతో పట్టణ ఎస్‌ఐ అబ్దుల్ రజాక్‌ను వివరణ కోరగా ఇసుక తవ్వకాలపై ఎలాంటి సమాచారం లేదన్నారు.

# ఎల్ఆర్ఎస్‌కు మోక్షం

కామారెడి : అక్రమ లేఅవుట్‌లు, ప్లాట్ల క్రమబద్ధీకరణతో స్థానిక సంస్థలకు ఆదాయం, విక్రయదారులకు ఊరట లభిస్తుందని భావించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు మూడేళ్లకు మోక్షం లభించింది. 2020లో దరఖాస్తులు చేసుకున్న వారి దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం జీవో నెం. 131 విడుదల చేసింది. నిబంధనల మేరకు ఉన్న స్థలాలను రెగ్యు లరైజ్ చేయడానికి అనుమతులు జారీ చేసింది. లే అవుట్ లేకుండా వెంచర్లు ఏర్పాటు చేయడం అక్రమ లేఅవుట్‌లు విచ్చలవిడిగా అమ్మకాలు, కొనుగోలు చేయడంతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం లేఅవుట్‌లేని ప్లాట్లకు రిజిస్ట్రేషన్‌లు నిలిపివేసింది. దీంతో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చాలా తగ్గిపోయాయి. ఆదాయం కూడా తగ్గడంతో ప్రభుత్వం పునరాలోచించింది. ఆన్‌లైన్‌లో రూ.1000 ఫీజు చెల్లించి లే అవుట్ లేని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో పాటు దరఖాస్తు చేసుకుంటే రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్లాట్ల క్రయవిక్రయాలు జరుపుకోవచ్చని ఆదేశించింది. దీంతో లే అవుట్‌లేని ప్లాట్ల యజమానులు ఆన్‌లైన్‌లో వెయ్యి రూపాయలు చెల్లించి దరఖాస్తులు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల రూపేనా ప్రభుత్వానికి కాస్త ఆదాయం సమకూరింది. కానీ లే అవుట్‌లను పరిశీలించకపోవడంతో ఆయా మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు 33 శాతం జరిమానా రూపేనా రావాల్సిన ఆదాయం రాకుండా పోయింది. దీంతో స్థానిక సంస్థలకు ఎల్ఆర్ఎస్‌తో ఆదాయం సమకూరకుండా పోయింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రజల ఎదురుచూపులకు చెక్ పడడంతో పాటు స్థానిక సంస్థలకు ఆదాయం సమకూరనుంది. అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పలు మార్గదర్శకాలను జారీ చేసింది. అనధికార లేఅవుట్లలో రిజిస్టర్‌సెల్ డీడ్ ద్వారా కొనుగోలు చేసిన ప్లాట్లకు అనుమతి ఇవ్వనున్నారు. కనీసం 10 శాతం ప్లాట్ల రిజిస్టర్ సెల్‌డీడ్ ద్వారా విక్రయించిన అనధికార లే అవుట్‌లకు, సెల్‌డీడ్ లేదా టైటిల్‌డీడ్ తప్పనిసరిగా ఉండాలి. అసైన్ భూముల్లో ప్లాట్లు, లే అవుట్‌లు ఉంటే కలెక్టర్ అనుమతి తప్పనిసరిగా తీసుకోనున్నారు. నిషేధిత జాబితాలో భూములను ప్లాట్లుగా మార్చితే వాటిని ఎల్ఆర్ఎస్‌కు రిజక్ట్ చేయనున్నారు. భూ గరిష్ట పరిమితి చట్టానికి భిన్నంగా ఉన్నవి, సరిహద్దులు మొదలైన వివాదాలు ఉంటే అనుమతి నిరాకరించనున్నారు. జీవో 111లో నిర్దేశించిన ప్రాంతాలు చెరువులు, ఎఫ్‌డీఎల్ పరిధిలో ఉన్నవి, నాలాకు రెండు మీ



టర్ల లోపు ఉంటే వాటికి అనుమతి నిరాకరించనున్నారు. అక్రమప్లాట్ల క్రమబద్ధీకరణకు రెండు దశల్లో పూర్తి చేయనున్నారు. వచ్చిన దరఖాస్తులను మొదట మున్సిపాలిటీ, పంచాయతీల వారిగా వేరు చేస్తారు. తర్వాత గ్రామ సర్వే నెంబర్, కాలనీ, వార్డుల వారీగా విభజిస్తారు. రెండో దశలో అధికారులు క్షేత్రస్థాయిలో స్థలాలను పరిశీలిస్తారు. రెవెన్యూ, నీటి పారుదల పంచాయతీరాజ్ శాఖలు, పట్టణ ప్రణాళిక అ?ధికారులు ఈ బృందంలో సభ్యులుగా ఉంటారు. ఎల్ఆర్ఎస్ నిబంధనలకు లోబడి ఉన్న వాటి వివరాలు మున్సిపల్ కమిషనర్‌కు అందించనున్నారు. అనంతరం వాటిని జిల్లా కలెక్టర్ అనుమతితో ఆమోదిస్తారు. జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల్లో మొత్తం 30 వేల మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను పరిశీలించడానికి ఇప్పటికే సర్వే నెంబర్లు, స్థల విస్తీర్ణం ప్రకారం క్లస్టర్‌లుగా విభజించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, పట్టణ ప్రణాళికల విభాగాల అధికారులతో బృందాలను ఏర్పాటు చేశారు. దరఖాస్తు దారులంతా ఆన్‌లైన్‌లో రూ.1000 చెల్లించారు. దరఖాస్తులు స్వీకరించినా ఎలాంటి మార్గదర్శకాలు లేకపోవడంతో క్రమబద్ధీకరణ అంశం ముందుకు సాగలేదు. దీంతో 2020లో రిజిస్ట్రేషన్ తేదీ పెంచుతూ జీవో నెం. 131 మున్సిపల్‌శాఖ విడుదల చేసింది. 2020 ఆగస్టు 26కు ముందే స్థలాలను రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలని పేర్కొంటూ మార్గదర్శకాలను విడుదల చేసింది. దరఖాస్తుల్లో పేర్కొన్న స్థలాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశీలించి బఫర్‌జోన్, గ్రీన్‌జోన్, కమర్షియల్ జోన్‌లలో లేదని నిర్ధారించుకోవాలని సూచించింది. అనంతరం స్థలం విలువ ఆధారంగా ఫెనాల్టీని వసూలు చేయాలని నిర్ధేశించింది.

# దుకాణం దూరం.. రేషన్ భారం

ఆసిఫాబాద్ :వీరు రేషన్ బియ్యం కోసం 3 నుంచి 4 కిలో మీటర్ల దూరంలోని గంభీరావుపేట గ్రామంలోని దుకాణానికి వెళుతున్నారు. ఏదులపాడులో కొత్తగా రేషన్ దుకాణం మంజూరైనా ఏర్పాటు చేయలేదు. లబ్ధిదారులు వ్యయప్రయాసలకు గురవుతున్నట్లు వాపోతున్నారు. పాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన నూతన పంచాయతీల్లో కొత్త రేషన్ దుకాణాల ఏర్పాటులో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. కొత్త దుకాణాలు మంజూరైనా ఏర్పాటు చేయకపోవడంతో కొన్ని గ్రామాల్లోని రేషన్ లబ్ధిదారులు కి.మీ. దూరం వెళ్లి వ్యయప్రయాసలకు గురవుతున్నారు. జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. సరైన రోడ్డు సౌకర్యాలు లేక వర్షాకాలంలో వీరి బాధలు వర్ణణాతీతంగా ఉంటున్నాయి. జిల్లాలో 335 పంచాయతీలకు గాను 301 చోట్ల రేషన్ దుకాణాలు ఉన్నాయి. వాటిలో కొత్తగా మంజూరు చేసిన 35 రేషన్ దుకాణాల్లో ఇప్పటి వరకు 22 ప్రారంభించారు. ఇంకా 13 దుకాణాలు ప్రారంభం కావాల్సి ఉంది. ఇక్కడ సంబంధిత మండలాల తహసీల్దార్లు డీలర్లను నియమించకపోవడం లబ్ధిదారులకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. ఇవే కాకుండా కొత్తగా పంచాయతీలుగా ఏర్పడ్డ కొన్ని గ్రామాల ప్రజలు సైతం రేషన్ దుకాణాల ఏర్పాటు కోసం ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వాస్తవానికి రేషన్ డీలర్ల భర్తీ పరీక్ష నిర్వహించి ఎంపిక చేయాలి. కానీ జిల్లాలో ఈ విధానం సక్రమంగా అమలు కావడం లేదు. 2021 ఆగస్టు 17న ఆసిఫాబాద్ డివిజన్‌లోని 18 రేషన్ డీలర్ల ఖాళీల కోసం పరీక్ష నిర్వహించారు. వాటిలో 12 మందిని భర్తీ చేయగా ఆరు దుకాణాలను తాత్కాలిక డీలర్లు నడుపుతున్నారు. కాగజ్‌నగర్ డివిజన్‌లోని 29 ఖాళీలకు పరీక్ష నిర్వహించలేదు. అప్పుడు జిల్లాలో



రేషన్ దుకాణాల సంఖ్య 279. ప్రస్తుతం వాటి సంఖ్య 301కి చేరింది. వీటిలో సుమారు 75 దుకాణాలకు సంబంధించి ఇన్‌ఛార్జిలు, కొన్నిచోట్ల ఒకేడీలర్ రెండుదుకాణాలు నిర్వహిస్తున్నారు. దీంతో నిర్వహణ గాడితప్పుతోంది. చాలా చోట్ల ప్రజా ప్రతినిధులు, అధికారులు తమకు నచ్చిన వారికే తాత్కాలిక విధానంలో అప్పగిస్తుండటంతో చాలాచోట్ల రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. ఆసిఫాబాద్ మండలం మానిక్‌గూడ, ఈదులవాడ, ఇప్పల్‌నవెగాం, మాలన్‌గొంది, కౌటగూడ, అప్పపెల్లిలో వాంకిడి మండలం రాంనగర్, చౌపన్‌గూడ, ఘాట్‌జన్‌గాం, ఇంధాని, బెజ్జూర్ మండలం గోల్కొండ, బొగుడగూడ, ఊట్‌సారంగపల్లి, తిర్యాణి మండలంఏదులపాడ్, జైనూర్ మండలం చింతకర్రలో కొత్త రేషన్ దుకాణాలు మంజూరైనా డీలర్ల నియామకం కాలేదు. ఈ గ్రామాల లబ్ధిదారులు సమీపంలోని సుమారు 3 నుంచి 5 కి.మీ. దూరంలోని గ్రామాలకు వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

# మున్సిపల్ చిట్టా.. వివాదాల పుట్ట



నిర్మల్: 2021 డిసెంబరులో మున్సిపల్‌లో పీహెచ్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయ్యింది. చాలామందికి కాల్‌లెటర్లు పంపించారు. నామమాత్రంగా ముఖాముఖి, ధ్రువపత్రాల పరిశీలన చేపట్టిన అధికారులు తాము ముందుగానే ఎంపికచేసిన 44 మందికి ఉద్యోగాలు కట్టబెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇందులో బల్దియాకు చెందిన కీలకనేత కుటుంబసభ్యులు సహా అధికార పార్టీ నేతల బంధువులకు ప్రాధాన్యం కల్పించడం గమనార్హం. పలు పార్టీలు, ఇతర ఉద్యోగార్థుల ఆధ్వర్యంలో ఆందోళనలు జరిగాయి. విషయం తీవ్రమవడంతో విచారణ జరిపిస్తానని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా పాలనాధికారి ముషారఫ్ అలీ ఫారుఖీ హామీ ఇచ్చారు. వరుస ఆందోళనలు, వివాదాల నడుమ ఉద్యోగ నియామక ప్రక్రియను గత సంవత్సరం జులై 15నే రద్దు చేసినట్లు పాలనాధికారి ప్రకటించి, మున్సిపల్ కార్యాలయంలో నవంబరులో ఉత్తర్వులను ప్రదర్శించారు. పాత తేదీతో నోటీసులు ఏర్పాటుచేయడంపై స్థానికంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. గత నవంబరులో ఆదిలాబాద్‌లో జరిగిన డిపార్ట్‌మెంటల్ పరీక్షకు నిర్మల్ మున్సిపల్‌లో పనిచేస్తున్న 14 మంది హాజరైనట్లు తెలుస్తోంది. వీటి ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. ఇందులో 13 మంది ఫెయిలవ్వగా, ఒకరు పాసైనట్లుగా సమాచారం. ఆయాశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు మాత్రమే డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రాసే అవకాశం ఉంటుంది. నిర్మల్ బల్దియా పరిధిలో పరీక్షకు హాజరైనవారిలో పొరుగుసేవల సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. వీరంతా గతంలో జరిగిన పీహెచ్ ఉద్యోగాల భర్తీలో స్థానం దక్కించుకున్నవారని, ఆ ఉద్యోగ నియామక ప్రక్రియనే రద్దుచేశాక వీరు పరీక్షకు ఎలా హాజరయ్యారనేది సందేహాస్పదం. ఉద్యోగుల ఐడీ లేకుండా పరీక్ష రాసే అవకాశం లేదు. అయినా.. వీరు పరీక్ష రాయగలిగారంటే ఉద్యోగులకు ఐడీలు ఇచ్చారా, ఇస్తే ఎలా ఇచ్చారు? నియామక ప్రక్రియను రద్దుచేసిన అధికారులు ఇప్పుడు పరీక్ష పాసైన వారిని ఏం చేస్తారు లాంటి ప్రశ్నలు స్థానికులను అయోమయానికి గురిచేస్తున్నాయి. వివాదం సద్దుమణిగితే తిరిగి నియామకం చేపట్టాలని భావించారో ఏమో.. మొత్తానికి ఆందోళనల సమయంలో ఉద్యోగాల భర్తీ ఇంకా పూర్తి కాలేదని, ఎవరూ ఆదుర్దా చెందవద్దంటూ బల్దియా నాయకులు, అధికారులు అందరినీ మభ్యపెట్టేందుకు ప్రయత్నించారు. ఖజానాశాఖ నుంచి అప్పటికే ఐడీలు కేటాయించిన విషయమూ నిర్ధరణ చేయలేదు. కానీ.. ఇప్పుడు నియామక ప్రక్రియ రద్దు కన్నా ముందే ఐడీలు కేటాయించామని పేర్కొంటుండటం గమనార్హం. నియామక ప్రక్రియ రద్దు చేస్తున్నట్లు పాలనాధికారి ప్రకటించిన నోటిఫికేషన్ కన్నా ముందే ఐడీలు కేటాయించడంతో వారంతా డిపార్ట్‌మెంటల్ టెస్ట్‌కు దరఖాస్తు చేసి పరీక్షకు హాజరయ్యారు. ఈ ఐడీలను రద్దుచేయాలని ఇప్పటికే ఖజానాశాఖ అధికారులకు సూచించాం. ఉన్నతాధికారులకు సైతం ఇదే విషయమై సమాచారం అందించాం. అప్పటి నియామకంలో ఉద్యోగాలు పొందినవారికి కేటాయించిన ఐడీలన్నీ రద్దవుతాయి. దీనివల్ల పరీక్ష రాసినవారికి, పాసైనవారికి ఎలాంటి ప్రయోజనం కలగదు.

# అక్రమ నిర్మాణాలతో హైటెన్షన

ఖమ్మం,: భవన నిర్మాణానికి అన్ని అనుమతులు తీసుకున్నా.. ప్లానింగ్ నుంచి మొదలు అన్ని నిబంధనలు పాటించినా నిర్మాణ సమయంలో స్వల్ప తేడా వచ్చిందంటే చాలు.. కార్పొరేషన్ అధికారులు ఆ నిర్మాణాన్ని అన ఆథరైజ్డ్ కనస్ట్రక్షన (యూ ఏసీ)గా నమోదు చేసుకుంటారు. ఇంటి నెంబరు కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో ఏటా చెల్లించే ఇంటిపన్నుకు అదనం గా రూ. 2వేల వరకు వసూలు చేస్తున్నారు. అది కావాలని చేసింది కాదని, నిర్మాణ సమయంలో స్వల్ప తేడా వచ్చిందని చెప్పినా పట్టించుకోరు. తాము విధించిన సొమ్ము చెల్లించాల్సిందేనని నిక్కచ్చిగా వ్యవహరిస్తారు. సామాన్యుల విషయంలో ఎంతో నిక్కచ్చిగా వ్యవహరించే అధికారులు.. కొందరి విషయంలో మాత్రం తమ నిబంధనలను పక్కన పెట్టేస్తారు. కాసులకు కక్కుర్తి పడి.. అసలు ఎలాంటి అనుమతులు లేకుండా దర్జాగా అక్రమ నిర్మాణాలు చేసిన వారికి వత్తాసు పలుకుతుంటారు. అందుకు నగరంలో పలు చోట్ల హైటెన్షన్ విద్యుత లైన్ల కింద జరిగిన.. జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలే నిద ర్శనం. సాధారణంగా ఎవరైనా ఇంటి నిర్మాణానికి అనుమతుల కోసం దరఖాస్తు చేస్తే.. ఆ ప్రాంతంలో విద్యుత లైన నుంచి అన్ని అంశా లను పరిశీలించే అధికారులు పెద్దపెద్ద విద్యుత లైన్లు ఉన్న ప్రాంతాల్లోనూ నిర్మాణాలకు అనుమతులిస్తున్నారు. అలాంటి లైన్ల కింద చేపట్టిన నిర్మాణాలతో ఏదైనా ప్రమాదం జరిగి.. ఆస్తి, ప్రాణ నష్టం జరిగితే పరిస్థితేంటన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేవలం ప్రమాదం జరిగినప్పుడే స్పందిస్తున్న అధికారులు.. ప్రక్షాళన చర్యల విషయంలో పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పల్లె ప్రాంతాలు, పట్టణ, నగర ప్రాంతాల్లో 11కేవీ, 33 కేవీ లాంటి విద్యుత లైన్ల కారణంగా ఏటా పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడటంతోపాటు, మూగజీవాల ప్రాణాలు కూడా గాల్లో కలుస్తుండగా.. పలు సంఘటనల్లో ఆస్తి నష్టాలు జరుగుతున్నాయి. అలాంటిది ఇక 132, 220, 400కేవీ లాంటి హై టెన్షన లైన్లు తాకితే, దాని వల్ల ఏదైనా ప్రమాదం తలెత్తితే జరిగే నష్టాన్ని ఊహకే అందని పరిస్థితులు ఉంటాయి. అయితే కొన్నేళ్లుగా ఇలాంటి నష్టం జరగకపోయినా.. ఇటీవల ఖమ్మం ప్రశాంతినగర్‌లో జరిగిన సంఘటనను పరిశీలిస్తే అధికారులు చేసే తప్పిదాలు ఎంతటి నష్టాన్ని చేకూరుస్తాయో అర్థమవుతోంది. 1975నుంచి దశలవారీగా ఖమ్మానికి ఉన్న విద్యుత అవసరాల మేరకు కొత్తగూడెం, బూడిదంపాడు, పెద్ద గోపతి, ఆరెంపుల, కూసుమంచి లాంటి ప్రాంతాలకు ఖమ్మం నగరానికి కలుపుతూ 30కిలోమీటర్ల మేర 132కేవీ విద్యుత హైటెన్షన లైన్లను ఏర్పాటు చేశారు. కాగా ఆయా హైటెన్షన లైన్లకు సంబంధించి ట్రాన్స్‌కో నిబంధనల ప్రకారం నిర్మాణాలు, రహదారులు చేపట్టకూడదు. కానీ ప్రస్తుతం ఖమ్మం నగరంలో సుమారు 10వేలకు పైగానే సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు ఆయా లైన్ల కిందనే చేశారు. ఎలాంటి నిబంధనలు



పాటించకుండానే కొందరు అక్రమార్కులు భారీ భవంతులు నిర్మించినా అధికారులు పట్టించుకోకపోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఆ ప్రాంతాల్లో అసలు అనుమతులే ఉండవంటే.. కొందరు ఏకంగా పెంట్ హౌజ్‌లు వేసేస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాల వెనుక కార్పొరేషన్ అధికారుల ప్రమేయం ఏ మేరకు ఉందో అర్థమవుతోంది. అక్రమంగా నిర్మాణాలు చేపడితే వాటిని అడ్డుకుని కూలగొట్టే అధికారం కార్పొరేషన్ అధికారులకు ఉంది. ముందుగానే అక్రమ నిర్మాణాలు, అవకతవకలను పరిశీలించేందుకు కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఆర్‌అండ్‌బీ, నీటిపారుదల శాఖ, మునిసిపల్ కమిషనర్‌తో ఓ కమిటీ కూడా ఉంది. అయితే కొందరు కిందిస్థాయి అధికారులు కార్యాలయాల నుంచి బయటకు కదలకపోవడం, తమ కింద ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేసుకుని వారితోనే పనులన్నీ మమ అనిపించడం లాంటి కార్యక్రమాలతో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపూ లేకుండా పోతోందన్న వాదన వినిపిస్తోంది. అంతేకాదు ఆయా హై టెన్షన విద్యుత లైన్ల కింద చేసిన నిర్మాణాలకు అధికారులు ఇళ్ల నెంబర్లు కూడా కేటాయించడం గమనార్హం. దాని వెనుక పెద్ద ఎత్తున నగదు చేతులు మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే పలు ప్రాంతాల్లో చేపట్టే ఇళ్ల నిర్మాణాలకు కార్పొరేటర్లు అండదండలు పుష్కలంగా ఉంటున్నాయన్న వాదనా ఉంది. అలా ఖమ్మం నగరంలోని కైకొండాయి గూడెం, జయనగర్ కాలనీ, అమరావతి నగర్, ఖానాపురం హవేలీ ప్రాంతాల్లో హైటెన్షన్ లైన్ల కింద బోలెడన్నీ ఇళ్లు అక్రమంగా నిర్మాణాలు చేసినట్టు తెలుస్తోంది. ఇటీవల ప్రశాంతినగర్ ఘటన తర్వాత అధికారుల తీరుపై ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. ఇల్లు నిర్మాణం పూర్తయి గృహప్రవేశం జరిగే వరకు ఆ ఇంటి గురించి ఎందుకు పట్టించుకోలేదన్న వాదన వినిపిస్తోంది. అంతేకాదు ఆయా లైన్ల కింద ఇంటి నిర్మాణాలు చేసిన వారు దొడ్డిదారిన ఇంటి నెంబరు పొందగా.. వాటికి విద్యుత శాఖ అధికారులు మీటర్లు ఎలా ఇచ్చారన్నది ప్రశ్నార్థకం. నగరంలో స్పెషల్ డ్రైవ్‌లు ఏర్పాటు చేసి ఇలాంటి నిర్మాణాల నిగ్గు తేల్చాలని, భవిష్యతలో విద్యుత ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# స్థలాల క్రమబద్ధీకరణకు మరో అవకాశం



గద్వాల :ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్న వారికి జీవో నెం.58, 59 కింద క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం మరోసారి అవ కాశం కల్పించింది. ఈ మేరకుసీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతోపాటు అర్హులైన పేదలు ఆయా స్థలాలు క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం దక్కుతుంది. క్షేత్రస్థాయిలో సరైన ప్రచారం జరగకపోవడంతో తక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయనే వాదనలున్నాయి. మరోవైపు తాము అక్రమించుకున్న స్థలం బహిర్గతం అవుతుందనే ఉద్దేశంతో దరఖాస్తులు చేసుకోవడానికి ఇష్టపడనివారు కొందరైతే, ఆక్రమించుకున్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందనే భయంతో మరి కొంత మంది దరఖాస్తులు చేసుకోలేదని అప్పట్లోనే రెవెన్యూవర్గాలు అభిప్రాయపడ్డాయి. గతంలో ఇలా.. : జీవో నెం.58, 59 కింద క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునేందుకు 2022 మార్చి 31 వరకు అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లాలో జీవో నెం. 58 కింద 2,820 దరఖాస్తులు వచ్చాయి. జీవో నెం.59 కింద మహబూబ్‌నగర్‌లో 90, గద్వాలలో 104 దరఖాస్తులు వచ్చాయి. మిగిలిన జిల్లాలో దరఖాస్తులపై స్పష్టత రావడం లేదు. దరఖాస్తుదారు వివరాలతో గత జులైలో ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక అందిం చాయి. ఇందులో జీవో నెం.58 కింద మాత్రమే అధికారులు అర్హులను గుర్తించారు. జీవో నెం.59 కింద 90 శాతం దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. గద్వాల జిల్లాలో ఈ జీవో కింద వచ్చిన 103 దరఖాస్తుల్లో ఒక్కదాన్ని కూడా అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు. గత జులైలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారిని గుర్తించారు. ఎమ్మెల్యేలతో పట్టాలు పంపిణీ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో ప్రభుత్వం మరోసారి దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. 2015లో జారీ చేసిన జీవో నెం. 58, 59 సక్రమంగా అమలు కాలేదని విమర్శల నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా 2022 ఫిబ్రవరిలో జీవో నెం. 58, 59లకు అనుబంధంగా జీవో నెం. 14ను జారీ చేసింది. దీని ప్రకారం 2014 జూన్ 2వ తేదీ కంటే ముందు ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఉన్నట్లు ఆధారాలు సమర్పించిన వారి స్థలాలను క్రమబద్ధీకరణ చేస్తారు. 125 చదరపు గజాల స్థలం వరకు ఎలాంటి రుం వసూలు చేయకుండా ప్రభుత్వమే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తుంది. 125 చదరపు గజాల కంటే ఎక్కువగా ఉంటే స్థానికంగా భూముల రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం ధరలు చెల్లిస్తే క్రమబద్ధీరకరణ పూర్తి చేసి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారు. రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం మేరకు క్రమబద్ధీరకరణకు మరో అవకాశం కల్పించారు. క్రమబద్ధీకరణకు గడు వు, మార్గదర్శకాలు విడుదలయ్యేంత వరకు స్పష్టత రాదు. అన్ని జిల్లాలో దరఖాస్తులు పెరిగే అవకాశాలు ఉంటాయి.

# మేడ్చల్ బల్దియాకు ఆర్థిక గ్రహణం

మేడ్చల్ : మేడ్చల్ బల్దియా ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. ఆదాయం సమకూర్చుకునే విషయంలో మల్లగుల్లాలు పడుతోంది. మున్సిపాలిటీకి రాబడి తక్కువ, వ్యయాలు ఎక్కువైతున్నాయి. మున్సిపల్‌కు రాజకీయ గ్రహణంతో పాటు ఆర్థిక గ్రహణం పట్టుకుంది. మున్సిపాలిటీకి ఏటా పన్నుల రూపేనా రూ.11కోట్ల ఆదాయం సమకూరుతుంది. వీటిలో రూ.7కోట్ల వరకు సిబ్బంది జీతాలకే సరిపోతోంది. ఇక మిగిలిన రెండు మూడు శాతం నిధులు సాధారణ పనులు, విద్యుత్ పరికరాలు, బ్లీచింగ్, పారిశుధ్య సామగ్రి తదితర వాటికి వినియోగిస్తారు. కాగా ఈ ఏడాది మున్సిపాలిటీ పన్నుల వసూల్లో వెనుకంజలో ఉన్నట్లు తెలుస్తోంది. వంద శాతం పన్నులు వసూలు కష్టతరంగా మారింది. కమిషనర్, సిబ్బంది ఉదయం సాయంత్రం ఇంటింటికీ తిరిగి తమవంతు శాయశక్తులా ప్రయత్నిస్తున్నా ఇప్పటి వరకు 71శాతం పన్నులే వసూలు చేశారు. ప్రధానంగా ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహించిన షఫీ ఉల్లాను కొన్ని కారణాల వల్ల ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఇన్‌చార్జి కమిషనర్‌గా గుండ్లపోచంపల్లి కమిషనర్ రాములును నియమించారు. కమిషనర్ బదిలీ నాటికి పన్ను వసూళ్లు 42శాతం ఉండగా, ప్రస్తుత కమిషనర్ 62శాతానికి తీసుకొచ్చారు. గతేడాది 93శాతం వసూలు చేసిన మున్సిపాలిటీ ఇప్పుడు 71శాతంతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మున్సిపాలిటీకి వచ్చే ఆదాయంలో అత్యధిక శాతం సిబ్బంది వేతనాలకే



సరిపోతుండటంతో నిధుల లేమతో ఇక్కడ అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే ఆర్థిక సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్న మేడ్చల్ మున్సిపాలిటీకి తక్కువ ఆదాయంతో ఇబ్బందుల తప్పడం లేదు. అభివృద్ధి పనులకు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూపాయి అయినా ఖర్చు పెట్టలేని దయనీయస్థితి నెలకొంది. ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వల ద్వారా మున్సిపాలిటీకి కేటాయించే ప్రత్యేక నిధులపై ఆధారపడి ఇక్కడ అభివృద్ధి పనులు చేసుకోవాలే తప్పా.. సొంత నిధులతో అభివృద్ధి పనులు చేసుకోలేని పరిస్థితికి మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితి దిగజారింది. ఈసారి పన్నుల వసూలు విషయంలో మున్సిపల్ సిబ్బందికి స్థానిక కౌన్సిలర్ల నుంచి అంతగా సహకారం లభించక పోవటం గమనార్హం.

# ఇరువర్గాల పోరు.. మురుగుతో బేజారు

అనంతపురం:అనంతపురం గ్రామీణం ఉప్పరపల్లి గ్రామంలో ఇరువర్గాల పోరులో మురుగుకాలువ సమస్య తీవ్రంగా మారింది. గ్రామంలోని బీసీ కాలనీలో సుమారు 500 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఈ కాలనీలోని ఇళ్లనుంచి వచ్చే మురుగు పసలూరు గ్రామానికి వెళ్లే దారిలోని మట్టికాలువ ద్వారా కొందరు వైకాపాకు చెందిన వారి పొలాల నుంచి వెళ్లేది. ప్రస్తుతం భూగర్భ జలాలు పెరిగాయని, పంట పొలాలు నాశనమవుతున్నాయని.. కాలువలో మట్టి వేసి మురుగు రాకుండా వీరు అడ్డుకట్ట వేశారు. వైకాపాకు చెందిన వారి ఇళ్లనుంచి వచ్చే మురుగు బీసీ కాలనీలోని కాలువ ద్వారా వెళ్తుంది. దీంతో ఆ కాలనీవాసులు అటువైపు నుంచి మురుగు రాకుండా కాలువలో మట్టి వేశారు. ఇరువర్గాల పోరులో కాలనీలో దుర్గంధం నెలకొంది. ఇటీవల గ్రామస్థులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తహసీల్దారు శ్రీధర్‌మూర్తి వెళ్లి పసులూరుకు వెళ్లే దారిలో కాలువలో వేసిన మట్టిని తొలగించారు. పొలాల యజమానులు కోర్టు నుంచి స్టే తెచ్చుకుని, కాలువల్లో మట్టివేశారని గ్రామస్థులు తెలిపారు. మా కాలనీలోని మురుగు గ్రామ పరిసరాల నుంచి వెళ్లే కాలువ ద్వారా పొలాలకు పారేది. కొంతకాలంగా వెళ్లేందుకు వీలులేకుండా మట్టి వేయడంతో బీసీ కాలనీమొత్తం మురుగుతో నిండింది. దోమలు, విషపురుగులు పెరిగాయి. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామ పరిసరాల్లోని సర్వే నెంబరు 137, 55లో మురుగు వెళ్లేందుకు మట్టికాలువ ఉండేది. కాలువ ప్రవహించే పొలాల యజమానులు మరుగునీరు, వర్షపు నీటితో భూగర్భజలాలు పెరిగాయని హై కోర్టులో కేసు వేయడంతో కోర్టు స్టే ఇచ్చింది. దీంతో కాలువ సమస్య మొదటికి వచ్చింది. సమస్యను పెద్ద మనుషులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.

## ధాన్యాన్ని
# మద్దతు ధరకు కొనుగోలు చేయాలి



మొవ్వ:రంగుమారిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఎపికౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఎపి కౌలు రైతు సంఘం జిల్లా సహయ కార్యదర్శి శీలం నారాయణ రావు,స్థానిక సంఘ నేతలతో కలిసి మొవ్వ మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. పంట పొలాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో ధాన్యపు రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సంఘ నేతలతో తమగోడు వెళ్ళబోసుకుని కన్నీటిపర్యంతమయ్యారు. దీంతో చలించిన నేతలు అండగా ఉంటామని రైతులకు ధైర్యం చెప్పి ముందుకు సాగారు. పంట చేతికివచ్చె అదునులో కురిసిన వర్షాల భారి నుంచి పంటను కాపాడుకునేందుకు ఉన్న వనరులతో రైతులు ప్రయత్నాలు చేసినా పంట నాణ్యత కోల్పోయిందని హరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అదునుగా మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారని విమర్శించారు. రైతులకు భరోసా లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో మిల్లర్లు చెప్పిన ధరకు ధాన్యం తెగనమ్ముకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాయ శాతం తెలుసుకునేందుకు మినీ మిల్లింగ్ మిషన్లు ఆర్‌బికెలలో ఏర్పాటు చేసి మిల్లరు ప్రమేయంలేకుండా అక్కడే ధర నిర్దారణ చేయాలన్నారు. గత ప్రభుత్వాలు 15 శాతం వరకు పాయ ఉన్నా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాయ శాతాన్ని 25 శాతానికి పెంచి కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహాశీల్దార్ సిహెచ్. వీరాంజనేయ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అం దజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతు సంఘం మండల నాయకులు వడ్డి వెంకటేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# పన్నులు, జూదం, క్యాసినోలకు మంత్రిత్వ శాఖ : టిడిపి



వినుకొండ : సంక్రాంతి సందర్భంగా విశాఖ నుండి విజయనగరం వరకు వందల ఎకరాల్లో పెద్దపెద్ద గుడారాలు ఏర్పాటుచేసి జూదాలు, క్యాసినోలు ప్రోత్సహించి రూ.కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దండుకుంటున్నారని టిడిపి పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జీవీ ఆంజనేయులు ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చెత్త పన్ను, ఇంటి పన్ను, జూదం, క్యాసినోలపై ఒక మంత్రిని పెట్టేలా ప్రభుత్వ తీరు ఉందన్నారు. కల్తీ మద్యం ద్వారా ప్రజారోగ్యంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెలగాట మాడుతోందని, పిచ్చి బ్రాండ్ల మద్యం తాగి ప్రాణాలా మీదకు తెచ్చుకోవద్దని ప్రజలను కోరారు. పంటలకు మద్దతు ధరల్లేక రైతులు అప్పుల్లో కూరుకుపోయారని, వీరిని ఆదుకోకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని, ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులివ్వడం లేదని విమర్శించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సొంతూరైన శావల్యాపురం మండలం వేల్పూరులో సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలను పోలీసులు మైకు అనుమతులు లేవనే సాకుతో అడ్డుకోవడం దుర్మార్గమని జీవీ ఆంజనేయులు మండిపడ్డారు. టిడిపి ఆధ్వర్యంలో ఉత్సవాలను సంతోషంగా నిర్వహిస్తుంటే జీర్ణించుకోలేని వైసిపి ఉద్దేశపూర్వకంగా పోలీసులు అడ్డుపెట్టుకొని ఆపివేయించిందని ఆరోపించారు. వైసిపి కార్యక్రమాలకు అడ్డురాని నిబంధనలు టిడిపి కార్యక్రమాలకు వచ్చాయా? అని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు నాగేశ్వరరావు, జె.గోవిందు నాయక్, పి.దాసయ్య, ఆర్.వీరంజనేయరెడ్డి, ఎ.కాసింపాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ విస్తృతా స్థాయి
# సమావేశాన్ని జయప్రదం చేయండి..

నంద్యాల :20 వ తేది న జరగబోయే కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశనీ జయప్రదం చేయాలని డీసీసీ అధ్యక్షుడు జే లక్ష్మీ నరసింహ యాదవ్ పిలుపునిచ్చారు అదే విధంగా ముఖ్య అతిథులుగా పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తెలంగాణ ఎంపీ- ఏపీ హత్ సే హత్ జోడో యాత్ర ఇంఛార్జి ఉత్తమ్ కుమార్ రెడ్డి , ఏఐసీసీ కార్యదర్శి సిడి మేయప్పాన్ ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలీ లు హాజరు అవుతున్నారని తెలిపారు.నంద్యాల పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు , జిల్లా ప్రధాన కార్యదర్శులు , కార్యదర్శులు , మండల అధ్యక్షులు , అనుబంధ విభాగాల అద్యక్షులు మరియు కార్యకర్తలు అభిమానులు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు.అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ యాదవ్ మాట్లాడుతూ డోన్ నియోజకవర్గం లో దొరపల్లి బ్రిడ్జి నందు జరిగిన ప్రమాదం లో మరణించిన వారి కుటుంబాలకు 40 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని,తక్షణమే దొరపల్లి, మల్లంపల్లి,లక్ష్మీ పల్లి, బొంతిరల్ల , గ్రామాలకు వెళ్ళడానికి అండర్ పాస్ బ్రిడ్జి లేదా సబ్ వే ఆయన మాట్లాడుతూ ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కపడలాని కమీషన్లకు కక్కృతి పడి ప్రజల ప్రాణాలతో చెలగాటం అడోదని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బండి ఆత్మ కూరు మండలంలో బాలశౌరి అనే జర్నలిస్ట్ పై వైయస్ఆర్సీపీ నాయ కులు దాడిచేసిన ఘటన చాలా దుర్మార్గమైన చర్యని ఈ దాడిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వ బోరుకు సంబంధించిన మెటీరియల్ ను కొందరు వ్యక్తులు తీసుకెళ్తంటే ప్రశ్నించేందుకు విలేకరిపై దాడి చేయడమంటే ఎవరు ప్రశ్నించకూడదనే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడు తున్నారనిఅన్నారు. వెంటనే ఎస్పీ డిఎస్పీ జోక్యం చేసుకొని విచారణ చేపట్టి దాడి చేసిన వారిపైన కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నంద్యాల ప్రభుత్వ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న బాల శౌరి ని లక్ష్మి నరసింహ పరామర్శించారు.



# స్థానిక ఎన్నికలపై తొలగని అడ్డంకులు



గుంటూరు : ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 3 మున్సిపాల్టీలకు మంగళగిరి-తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు ఎప్పటికి జరుగుతాయన్నది ఆయా ప్రాంత వాసులకు అంతుబట్టడం లేదు. 2021లో మార్చిలో గుంటూరు కార్పొరేషన్ సహా మరో ఆరు మున్సిపాల్టీలకు ఎన్నికలు జరిగాయి. 2022 ఏప్రిల్‌లో జిల్లా, మండల పరిషత్‌లకు ఎన్నికలు జరిగాయి. ఫలితాలు మాత్రం 2022 సెప్టెంబరులో వెలువడ్డాయి. పెండింగ్‌లో ఉన్న గురజాల, దాచేపల్లి నగర పంచాయతీలకు 2021 అక్టోబరు 15న ఎన్నికలు నిర్వహించారు. ఇదే సమయంలో స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించారు. కానీ పొన్నూరు, బాపట్ల, నర్సరావుపేట మున్సిపాల్టీలకు మంగళగిరి - తాడేపల్లి కార్పొరేషన్‌కు ఎన్నికలు ఇంకా నిర్వహించలేదు. తుళ్లూరు మండలాన్ని మున్సిపాలిటీగా మార్చాలనే ప్రతిపాదనతో ఈ మండలంలో ఎన్నికలు జరగలేదు. రాజధాని ప్రాంతంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగకపోవడంతో ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకోలేకపోయారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 57 జెడ్‌పిటిసిలకు గాను 54కు ఎన్నికలు జరిగాయి. తాడేపల్లి, మంగళగిరి, తుళ్లూరు జెడ్‌పిటిసి స్థానాలకు 2020లోనే నోటిఫికేషన్ ఇవ్వలేదు. తరువాత మంగళగిరి, తాడేపల్లి పట్టణాలు, పలు గ్రామాలు కలిపి కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. మంగళగిరి, తాడేపల్లి మండలాల్లోని 21 గ్రామాలను కలిపి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు స్టే ఇచ్చింది. మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్‌లో 50 డివిజన్లు చేయాలని అధికారులు ఇప్పటికే ప్రతిపాదించారు. హైకోర్టు స్టే ఉత్తర్వులతో ఈ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరగలేదు. పొన్నూరు, బాపట్ల, నర్సరావుపేట మున్సిపాల్టీల్లో పరిసర గ్రామాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ కూడా పలువురు కోర్టును ఆశ్రయించారు. మూడు మున్సిపాల్టీలకు కూడా ఎన్నికలు నిర్వహించలేదు. మొత్తం మీద ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు మునిసిపాలిటీలు,మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్‌లో ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయన్నదీ ప్రశ్నార్థకంగా మారింది.మరోవైపు రాజధాని ప్రాంతంలో మొత్తం 29 గ్రామాలు ఉండగా ఏడు గ్రామాలు మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్ విలీనం చేయగా తుళ్లూరు మండలంలోని 19, మంగళగిరి మండలంలోని మూడు గ్రామాలు కలిపి అమరావతి మెట్రోపాలిటన్ నగరంగా రూపొందించాలని 2021లో ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలపై పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రజాభిప్రాయ సేకరణలో ఆ ప్రతిపాదనను 22 గ్రామాల వారు వ్యతిరేకించారు. గతేడాది సెప్టెంబరులో అమరావతి మున్సిపాల్టీ ఏర్పాటు చేస్తూ ఇచ్చిన నోటీఫికేషన్‌పైనా గ్రామ సభల్లో వ్యతిరేకత వ్యక్తమైంది. సెప్టెంబరు 12 నుంచి వారం రోజుల పాటు జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో కూడా 22 గ్రామాలకు మున్సిపాల్టీని అంగీకరించబోమని గ్రామసభల్లో తీర్మానం చేశారు.రాజధాని ప్రాంతం పల్లే... పట్టణమో అర్థంకానీ పరిస్థితి ఉందని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. రాజధానిలోని 29 గ్రామాలను కలిపి ఒక కార్పొరేషన్‌గా మారిస్తే అభ్యంతరం లేదని కానీ రాజధాని ప్రాధాన్యతను తగ్గించేందుకు ఐదు గ్రామలను తాడేపల్లి, మంగళగిరి మున్సిపాల్టీల్లో విలీనం చేయడాన్ని రైతులు తప్పుపడుతున్నారు. వాస్తవంగా తాడేపల్లి, మంగళగిరి మునిసిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించకుండా ఏదో కారణంతో వాయిదా వేయాలన్న తలంపుతో అధికార పార్టీ నాయకులు కూడా స్టే ఉత్తర్వుల తొలగింపునకు ప్రయత్నమేమీ చేయడంలేదనే విమర్శలు ఉన్నాయి. రాజధాని మార్పును వ్యతిరేకిస్తూ జరుగుతున్న ఉద్యమం ప్రభావం ఈ రెండు పట్టణాలపై తీవ్రంగా ఉంటుందని భావిస్తున్నారు.

# ఆక్రమణల జోరు.. ఎవరూ పట్టించుకోరు..

శృంగవరపుకోట : మండల కేంద్రం నిత్యం రద్దీగా ఉండే నాలుగు రోడ్ల కూడలి, విశాఖ అరకు- రోడ్డు, ఎస్.కోట -విజయనగరం మెయిన్ రోడ్డు లలో ఇష్టానుసారంగా ఆక్రమణలు జరుగుతున్నాయి. ఇక్కడ పెత్తందారులు ఇష్టానుసారం రోడ్లను ఆక్రమించేసి నిర్మాణాలు చేపట్టారు. దుకాణాల నిర్వాహకులు సైతం రోడ్లమీదకు తమ షాపుల ముందు ఉన్న షెడ్లను తెచ్చి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కాలేజీ గ్రౌండ్‌కు ఆనుకొని రోడ్డు మార్జన్‌లను షాపుల నిర్వాహకులు ఆక్రమించి ఏర్పాటు చేసిన షాపులు సైతం రోడ్లపైకి నిర్మించడం ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. ఇక్కడే అధికంగా చికెన్, మటన్ దుకాణాలు ఉండడంతో వారికి కోళ్లను సప్లై చేసే వాహనాలు నిత్యం రోడ్లమీద ఆపటం వల్ల రెండో వాహనం పక్కనుండి వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పైగా షాపులు రోడ్లమీదకు ఉండడంతో ద్విచక్ర వాహనాలు సైతం రోడ్లపైనే నిలపాల్సి వస్తుంది. నిత్యం మండల కేంద్రంలో ఈ రద్దీను దాటుకునే ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తిరుగుతున్నా ఆక్రమణలను చూసి చూడటన్లు వ్యవహరిస్తున్నారు. తెల్లవారుజామున పాత బస్టాండ్ వద్ద పరిస్థితి వాహనదారులకు నిత్యం నరకయాతనే. ఇక్కడ రోడ్డుమీద కూరగాయల మార్కెట్ నిర్వహిస్తుండడంతో ఉదయం పూట ఈ రోడ్డుమీద నడవడానికి సైతం ప్రజలు ఇబ్బందులు పడుతుంటారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ పరిసరాల్లోనే ఉన్న ఎల్ఐసి కార్యాలయం, ముంతాజ్ హొటల్‌కు పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో రోడ్లమీద వాహనాలను నిలిపేసి వెళ్లిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యంత బాధ్యత వహించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన పోలీసులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుంటే ఇక ఎవరిని నిందించాలో అర్థం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. చినుకు పడితే మరింత ఇబ్బంది ప్రధాన రహదారిలో చిన్నపాటి వర్షం కురిసినా నీరు రోడ్డుపై నిల్వ ఉండిపోతుంది. ఆర్‌టిసి కాంప్లెక్స్, రైతు బజార్ వద్ద నడిచేందుకు వీలులేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. పోలీసులు సైతం ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు కనిపించడం లేదు. అధికారులు వెంటనే స్పందించి రోడ్ల వెంట ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను తొలగించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్న మాట వాస్తవమే. షాపుల యజమానులు రోడ్ల మార్జినులషెడ్లను నిర్మించటం వల్ల వినియోగదారుడు వాహనాలను రోడ్లపైనే నిలపాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అన్ని శాఖల సహాయం తీసుకోవలసి ఉంటుంది. అన్ని శాఖలకు లెటర్లు పెడతాం. సహకరిస్తే పోలీస్ ప్రొడక్షన్ పెట్టి ట్రాఫిక్ సమస్యకు ముగింపు పాడుతాం.



# రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయండి : కలెక్టర్



రాయచోటి : జిల్లాలో జరుగుతున్న రీ సర్వే నందలి ముటేషన్స్, ఖాతా కరెక్షన్స్, ఇకెవైసి, ఫీల్డ్ పిఓఎల్ఆర్ తదితర మాడ్యూల్స్‌ను గడువులోపు వంద శాతం పరిష్కరించాలని కలెక్టర్ గిరీష ఆర్‌డిఒలు, తహశీల్దారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి రీ సర్వే, ఫీల్డ్ పిఒఎల్ఆర్, అసైన్మెంట్ ల్యాండ్, శ్మశానవాటికలు, బిఎస్ఎన్ఎల్‌కు స్థల కేటాయింపు, హౌస్ సైట్స్ జారీ, పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు జాబితా పెండింగ్ క్లైమ్స్ పరిష్కారం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ క్లెయిమ్స్ పరిష్కారం తదితర అంశాలలో ఆర్‌డిఒలు, తహశృల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 26 గ్రామాలలో మ్యుటేషన్స్, ఖాతా కరెక్షన్స్, క్లరికల్, డిజిటల్ సిగేచర్ తదితర నాలుగు రకాల మాడ్యూల్స్ పూర్తి చేశామన్నారు. 34 గ్రామాలలో మ్యుటేషన్స్ పరిష్కారం, 9 గ్రామాలలో మ్యుటేషన్స్, ఖాతా కరక్షన్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సంబంధిత ఆర్‌డిఒలు, తహశీల్దార్లు ఒకటి, రెండు మాడ్యూల్స్ మాత్రమే పెండింగ్‌లో ఉన్న వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వచ్చే వారంలోగా తప్పనిసరిగా పరిష్కరించాలని సూచించారు. 71 శాతం ఇకెవైసి పూర్తి చేశారని వంద శాతం పూర్తి చేసేలా ఆర్డీవోలు తగు దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలోని 465 గ్రామాలలో 81 గ్రామాలలో మాత్రమే ఫీల్డ్ పిఒఎల్ఆర్ ప్రక్రియను ప్రారంభించారని మిగిలిన అన్ని గ్రామాలలో వెంటనే ప్రారంభించాలన్నారు. విఆర్వోలు అందరూ ఫీల్డ్ పిఒఎల్ఆర్‌ను పూర్తిచేసే విధంగా ఆర్డీవోలు ప్రత్యేక దృష్టి పెట్టి తగు పర్యవేక్షణ చేయాలన్నారు. ఆయా డివిజన్లో ఎంతెంత అసైన్మెంట్ ల్యాండ్ ఉందన్న వివరాలను వెంటనే జిల్లా సచివాలయానికి పంపించాలని రాజంపేట సబ్ కలెక్టర్, రాయచోటి, మదనపల్లి ఆర్డీవోలను ఆదేశించారు. శ్మశాన వాటికలకు స్థల కేటాయింపులో భాగంగా ఆయా డివిజన్ల నుంచి ఇప్పటికే వచ్చిన 150 ప్రతిపాదనలకు అనుమతులు ఇచ్చామన్నారు. ఇంకనూ 54 ప్రతిపాదనలు రావాల్సి ఉందని, వచ్చే శుక్రవారం లోగా ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శ్మశాన వాటికలకు స్థల కేటాయింపులకు అనుమతులు జారీ చేసిన వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. బిఎస్ఎన్ఎల్‌కు స్థల కేటాయింపును ఈ వారంలో పూర్తి చేయాలన్నారు. హౌస్ సైట్స్ జారీకి సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేసి ఇకెవైసి పూర్తి చేయాలన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు జాబితా పెండింగ్ క్లెయిమ్స్ జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించాలని, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ లో పెండింగ్ ఉన్న 13,600 క్లెయిమ్స్‌ను కూడా పరిశీలించి 10 రోజుల్లో పూర్తిగా పరిష్కరించాలని చెప్పారు. ఉద్యోగుల హాజరు నమోదుకు సంబంధించి ప్రభుత్వ ఏపీఎఫ్ఆర్ఎస్-యాప్‌ను అందరూ డౌన్లోడ్ చేసుకొని ఎన్రోల్ అయి ప్రతిరోజు హాజరు వేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ సత్యనారాయణ, కలెక్టరేట్ ఎఒ బాలకృష్ణ, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

# సైకో పోయి.. సైకిల్ రావాలి : టిడిపి

పగిడ్యాల:రాష్ట్రంలో వైసిపి రాక్షస, సైకో పాలన పోయి బాబు రామ రాజ్యం రావాలని టిడిపి నందికొట్కూరు నియోజకవర్గ నాయకులు బండి జయరాజ్, మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. వైసిపి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వారు ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. అనంతరం టిడిపి నాయకులు లోకానందరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమవేశంలో వారు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యవసర సరుకులు, పెట్రోల్, డీజిల్, ఎరువులు తదితర వాటి ధరలు అధికంగా పెంచి ప్రజలపై, రైతులపై అధిక భారం వేసిందని మండిపడ్డారు. ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి గద్దెనెక్కిన వైసిపికి ఆధికారంలో కొనసాగే అర్హత లేదని విమర్శించారు. పింఛన్ మీదే ఆధారపడి జీవనం గడుపుతున్న వృద్దులకు, వింతతువులకు తీసివేయడం దారుణమన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో పింఛన్లు తొలగించకుండా పంపిణీ చేసేవారన్నారు. గత ఎన్నో ఏళ్ల తరబడి మూర్వకొండ, అర్లపాడు ఘాట్ల నుండి కృష్ణానదిపై సింగోటం జాతరకు నందికొట్కూరు, ఆత్మకూర్ నియోజకవర్గ ప్రజలు తరలి వెళ్లేవారని, ప్రస్తుతం బోటు ప్రయాణం నిషేధించడం విచారకమన్నారు. ఎక్కోడో ప్రమాదాలు జరిగాయని, జాతరకు ప్రజలను వెళ్లకుండా బోటు ప్రయాణం నిషేధించడం సరికాదన్నారు. కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయకుండా నదిపై బోటు ప్రయాణం నిషేధించడం విడ్డూరంగా ఉందన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో మాండ్ర శివానందరెడ్డి ఆధ్వర్యంలో సింగోటం జాతరకు వెళ్లే ప్రజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి పంపేవారని తెలిపారు. బస్సు ప్రయాణం మూడు గంటలు, ఖర్చు దాదాపు రూ.400 అవుతుందని, అదే మూర్వకొండ, అర్లపాడు ఘాట్ల నుంచి నదిపై రూ.100 ఖర్చుతో ప్రజలు వెళ్లేవారన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి రెండు కార్లకు నీరు ఇచ్చిన ఘనత మాండ్ర శివానందరెడ్డికే దక్కిందన్నారు. ప్రజా వ్యతిరేఖ విధానాలు అవలంభిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు వేసి పెద్ద తప్పు చేశామని ప్రజలు సిగ్గు పడుతున్నారన్నారు. ఆ తప్పును సరిదిద్దుకుని వచ్చే ఎన్నికలో టిడిపికి ఓట్లు వేసి గెలిపిస్తామని ప్రజలు చెబుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రామిరెడ్డి, శివారెడ్డి, నాగేశ్వరరావు, కుమార స్వామి, నాయకులు పాల్గొన్నారు.



# జిఒ -1పై సుప్రీంకోర్టులో ఎపి ప్రభుత్వం సవాల్

న్యూఢిల్లీ : జిఒ -1పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేసింది. పార్టీల రోడ్ షోలు, సభలపై ఆంక్షలు విధిస్తూ తెచ్చిన జిఒ నెంబరు 1ని తాత్కాలికంగా నిలిపివేస్తూ ఇటీవల ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు స్టే ఇచ్చింది. హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రహదారులపై బహిరంగ సమావేశాలు నిర్వహించకుండా రాజకీయ పార్టీల గొంతు నొక్కడానికి రాష్ట్రప్రభుత్వం జనవరి 2న జిఒ నెంబరు 1 తీసుకొచ్చిందంటూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపు న్యాయవాది ఎన్.అశ్వనీ కుమార్ వాదనలు వినిపిస్తూ.. 'స్వాతంత్రోద్యమ సమయంలో ర్యాలీలు, బహిరంగ సమావేశాలను అడ్డుకునేందుకు బ్రిటిష్ ప్రభుత్వం 144 సెక్షన్ విధించింది తప్ప.. ఇలాంటి ఉత్తర్వులివ్వలేదు. పోలీసు చట్టం సెక్షన్ 30, 30(ఎ)ని ఆధారంగా చూపుతూ బహిరంగ సమావేశాలను అడ్డుకోవాలని ప్రభుత్వం చూస్తోంది. అరుదైన, ప్రత్యేక పరిస్థితుల్లోనే సమావేశాలకు అనుమతి ఇచ్చే అంశాన్ని పోలీసులు పరిశీలించాలని జిఒ నెంబరు 1లో పేర్కొన్నారు. నచ్చినవారికి అనుమతి ఇచ్చి, నచ్చనివారికి నిరాకరించాలనే ఇలాంటి షరతు పెట్టారు.

పోలీసులను సంతృప్తిపరచాలని షరతు పెట్టడం రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను హరించడమే. రహదారులపై నిర్వహించే సమావేశాలు, ఊరేగింపులు, యాత్రల నియంత్రణకే పోలీసు చట్టం సెక్షన్ 30(2) పోలీసులకు అధికారం కల్పిస్తోంది. ఆ సెక్షన్‌ను ఆసరాగా చేసుకుని నిషేధం విధిస్తామంటే కుదరదు. బహిరంగ సమావేశాల నియంత్రణ ముసుగులో ప్రభుత్వం పూర్తి నిషేధం విధిస్తోంది. జీవో అమలును నిలుపు చేస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వండి' అని కోరారు. ప్రభుత్వం తరఫున ఎజి శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. పిల్ విచారణార్హతపై అభ్యంతరం ఉందన్నారు. ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం.. పోలీసు చట్టం సెక్షన్ 30కి విరుద్ధంగా జిఒ నెంబరు 1 ఉందని ప్రాథమికంగా అభిప్రాయపడింది. జిఒ నెంబరు 1 అమలును ఈ నెల 23 వరకు నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. తదుపరి విచారణను ఈనెల 20కి హైకోర్టు వాయిదా వేసింది.

# రాహుల్‌పైనే ఆశలు

దక్షిణాఫ్రికాతో తొలిటెస్ట్‌భారత్ 208/8 దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలిటెస్ట్‌లో టీమిండియా మిడిలార్డర్ బ్యాటర్ కెఎల్ రాహుల్ అర్ధసెంచరీకి తోడు విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్ కూడా రాణించడంతో భారతజట్టు 8వికెట్ల నష్టానికి 208పరుగులు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఆదిలోనే కష్టాల్లోపడింది. 11.1 ఓవర్లలో 24పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(17), రోహిత్ శర్మ(5) తక్కువ స్కోర్‌కే పెవీలియన్‌కు చేరగా.. శుభ్‌మన్ గిల్(2)ను బర్గర్ ఔట్ చేశాడు. బౌలింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై రబాడ సఫారీలకు తొలి బ్రేక్ ఇచ్చాడు. రోహిత్‌ను వెనక్కి పంపాడు. ఆ కాసేటపికే యశస్వీని బర్గర్ ఔట్ చేశాడు. స్వల్ప వ్యవధిలో రెండు కీలక వికెట్లు పడిన భారత్‌ను విరాట్ కోహ్లీ(4), గిల్ ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, బర్గర్ సూపర్ డెలివరీతో గిల్‌ను ఔట్ చేశాడు. అంపైర్ నాటౌట్ ఇవ్వడంతో రివ్యూ తీసుకొని మరీ వికెట్ సాధించింది. వికెట్ కీపర్ కెఎల్ రాహుల్(70బ్యాటింగ్) అర్ధసెంచరీతో ఆదుకున్నారు.. అశ్విన్(8) నిరాశపరిచినా.. శార్దూల్(24)తో కలిసి కెఎల్ రాహుల్ 7వ వికెట్‌కు 43పరుగులు జతచేశాడు. బుమ్రా(1)ను జెన్సన్ ఔట్ చేయడంతో టీమిండియా తొలిరోజే ఆలౌట్ అయ్యేలా కనిపించింది. సిరాజ్(0బ్యాటింగ్) కెఎల్ రాహుల్ కలిసి చివర్లో సఫారీ బౌలర్లను సమర్ధవంతంగా ఎదుర్కొన్నారు. దీంతో టీమిండియా తొలిరోజు వెలుతురులేమి కారణంగా ఆటనిలిచే సమయానికి 59ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 208పరుగులు చేసింది. రబడాకు ఐదు, బర్గర్‌కు రెండు, జెన్సన్‌కు ఒక వికెట్ దక్కాయి. ఆదుకున్న కోహ్లి, శ్రేయస్24పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ టీమిండియాను విరాట్ కోహ్లి(38), శ్రేయస్ అయ్యర్(31) ఆదుకున్నారు. వీరిద్దరూ



4 వికెట్‌కు 68పరుగులు జతచేశారు. తొలుత ఆచి తూచి ఆడినా.. వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు బాదారు. శ్రేయస్ ధాటిగా ఆడగా.. విరాట్ నెమ్మదిగా ఆడాడు. వీరు క్రీజ్‌లో నిలదొక్కుకోవడంతో లంచ్ విరామానికి టీమిండియా 26ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 91పరుగులు చేసింది. లంచ్ తర్వాత రబడా వేసిన ఓ గుడ్‌లెంగ్త్ బంతికి శ్రేయస్ 31పరుగుల వద్ద బౌల్డ్ అయ్యాడు. దీంతో వీరి భాగస్వామ్యానికి తెరపడింది.

# వినేశ్ ఫోగాట్ మోదీకి బహిరంగ లేఖ



భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ సంచలన నిర్ణయం తీసుకుంది. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గొడవకు నిరసనగా తన ఖేల్ రత్న, అర్జున అవార్డులను తిరిగి ఇస్తున్నట్లు ఒలింపియన్ వినేష్ ఫోగట్ మంగళవారం(డిసెంబర్ 26) రోజున తెలిపారు.కొద్దిసేపటి క్రితమే ఆమె ఎక్స్ (ట్విటర్) వేదికగా తన నిర్ణయాన్ని ప్రకటించింది. మల్లయోధులను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై నిరసన వ్యక్తం చేసినప్పటికీ మహిళా రెజ్లర్‌లకు జరగిన న్యాయంపై వినేష్ ఫోగట్ నిరాశను వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో షేర్ చేసిన ప్రధాని నరేంద్ర మోడీకి బహిరంగ లేఖలో వినేష్ ఫోగట్ ఆవేదన వ్యక్తం చేశారు. 'నేను నా ఖేల్‌రత్న, అర్జున అవార్డులను వాపస్ ఇచ్చేస్తున్నా' అని అందులో పేర్కొంది. బజరంగ్ పునియా తర్వాత అవార్డును ప్రభుత్వానికి తిరిగిచ్చేసిన రెజ్లర్ల జాబితాలో ఫోగాట్ రెండో క్రీడాకారిణి. బధిరుల ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణాలు నెగ్గిన విజేందర్ సింగ్ కూడా సాక్షి మాలిక్ రెజ్లింగ్ నుంచి తప్పుకున్నాక తన అర్జున అవార్డును వాపస్ ఇచ్చేస్తానని ప్రకటించినా కేంద్రం తీసుకున్న నిర్ణయంతో అతడు దీనిపై ఎటువంటి ప్రకటనా చేయలేదు. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) ఎన్నికల ఫలితాల తర్వాత జరిగిన పరిణామాలతో పలువురు రెజ్లర్లు తీవ్ర కలత చెందిన విషయం తెలిసిందే. ముఖ్యంగా డబ్ల్యూఎఫ్ఐ మాజీ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ సన్నిహితుడు సంజయ్ సింగ్ గెలుపొందిన వెంటనే సాక్షి మాలిక్ రెజ్లింగ్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించగా బజరంగ్ పునియా తన అర్జున అవార్డును వెనక్కిచ్చేశాడు. ఈ పరిణామాలతో అలర్ట్ అయిన కేంద్రం.. సంజయ్ సింగ్ ప్యానెల్‌ను సస్పెండ్ చేసింది. రెండు రోజుల క్రితమే బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కూడా తనకు రెజ్లింగ్‌తో ఏం సంబంధం లేదని, ఈ ఆటకు ఇక సెలవు అని కూడా ప్రకటించిన విషయం తెలిసిందే. బ్రిజ్ భూషణ్‌ను తప్పిస్తే ఈ అంశం చల్లారుతుందని భావించినా వినేశ్ ఫోగాట్ తాజా ప్రకటనతో ఈ చిచ్చు ఇప్పట్లో ఆరేలా లేదని తెలుస్తున్నది.

# 500 వికెట్ల క్లబ్‌లో సౌతాఫ్రికా బౌలర్..



భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టులో దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ కగిసో రబడ డేంజరస్ బౌలింగ్‌తో టీమిండియా బ్యాటర్లకు చుక్కలు చూపించాడు. భారత్‌తో జరిగిన టెస్టు ద్వారా రబడా అంతర్జాతీయ క్రికెట్‌లో 500 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. కేవలం 28 ఏళ్ల వయసులో 500 అంతర్జాతీయ వికెట్లు తీసిన ఘనత రబడా సొంతం చేసుకున్నాడు. సెంచూరియన్‌లో టీమిండియాతో జరుగుతున్న తొలి టెస్టులో రబడా ఇప్పటి వరకు 5 వికెట్లు పడగొట్టాడు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వంటి వెటరన్ బ్యాట్స్‌మెన్‌లను మ్యాచ్ తొలి రోజునే రబడా తన బాధితులుగా మార్చాడు. రబడా తన వేగం, ఖచ్చితమైన లైన్ అండ్ లెన్త్‌లకు ప్రసిద్ధి చెందాడు. భారత్‌తో టెస్టు తొలి రోజునే రబడా తన అద్భుత బౌలింగ్‌తో ఆఫ్రికాకు వరుసగా వికెట్లు అందిస్తూనే ఉన్నాడు. భారత్‌లోని చాలా మంది స్టార్ బ్యాట్స్‌మెన్‌లను రబడా తన బాధితులుగా చేసుకున్నాడు. 2014లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన రబడా.. ఇప్పుడు మూడు ఫార్మాట్లలో ఆఫ్రికా అగ్రగామి ఫాస్ట్ బౌలర్లలో ఒకడిగా పేరుగాంచాడు. కేవలం ఆఫ్రికాలోనే కాకుండా ప్రపంచంలోని స్టార్ ఫాస్ట్ బౌలర్లలో రబడా పేరు పొందాడు. రబడా తన కెరీర్‌లో ఇప్పటివరకు 60 టెస్టులు, 101 వన్డేలు, 56 టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు ఆడాడు. టెస్ట్‌లో 108 ఇన్నింగ్స్‌లలో బౌలింగ్ చేసి, అతను 22.34 సగటుతో 280 వికెట్లు తీశాడు. అందులో అత్యుత్తమం 7/112లుగా నిలిచింది. ఇది కాకుండా, ODIల్లో 99 ఇన్నింగ్స్‌లలో 27.77 సగటుతో 157 వికెట్లు తీసుకున్నాడు. అందులో అతని అత్యుత్తమం 6/16లుగా నిలిచింది. ఇక T20 అంతర్జాతీయ 56 ఇన్నింగ్స్‌లలో ఈ ఆఫ్రికన్ ఫాస్ట్ బౌలర్ 29.87 సగటు, 58 వికెట్లు పడగొట్టాడు. అందులో 3/20 అతని అత్యుత్తమంగా నిలిచింది. టీ20లో అతని ఎకానమీ 8.61గా ఉంది. ఇది కాకుండా, బ్యాటింగ్ చేస్తున్నప్పుడు, అతను టెస్టులో 93 ఇన్నింగ్స్‌లలో 897 పరుగులు, 42 ODI ఇన్నింగ్స్‌లలో 360 పరుగులు, T20 అంతర్జాతీయ 21 ఇన్నింగ్స్‌లలో 147 పరుగులు చేశాడు.

## కుదురుకుంటున్న సఫారీలు..

# లంచ్ టైమ్‌కు స్కోరు ఎంతంటే.!

భారత్-దక్షిణాఫ్రికా మధ్య సెంచూరియన్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో భాగంగా భారత్‌ను 245 పరుగులకే ఆలౌట్ చేసిన సఫారీలు.. లంచ్ సమయానికల్లా 16 ఓవర్లు ముగిసేటప్పటికీ ఒక వికెట్ కోల్పోయి 49 పరుగులు చేశారు.

ఇన్నింగ్స్ ఆరంభంలోనే ఎయిడెన్ మార్క్‌రమ్ వికెట్ కోల్పోయినా మాజీ సారథి డీన్ ఎల్గర్ (29 బ్యాటింగ్), టోని డి జోర్జి (12 బ్యాటింగ్) లు భారత పేసర్లను సమర్ధవంతంగా ఎదుర్కుంటున్నారు.

తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన సఫారీలకు నాలుగో ఓవర్లోనే షాక్ తగిలింది. ఓపెనర్‌గా వచ్చిన మార్క్‌రమ్.. 17 బంతులాడి ఒక బౌండరీ సాయంతో ఐదు పరుగులు చేశాడు. సిరాజ్ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో ఐదో బంతిని వికెట్ కీపర్ మార్క్‌రమ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. కానీ తర్వాత వచ్చిన జోర్జి.. మరో వికెట్ కోల్పోకుండా ఆడుతున్నాడు. బుమ్రా, సిరాజ్, ప్రసిధ్ కృష్ణతో పాటు శార్దూల్ ఠాకూర్, అశ్విన్‌లు బౌలింగ్ చేసినా సఫారీలు



నిలకడగా ఆడుతున్నారు.

అంతకుముందు రెండో రోజు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 245 పరుగులకు ఆలౌట్ అయింది. కెఎల్ రాహుల్ (101) సెంచరీ చేయగా కోహ్లీ (38), శ్రేయస్ అయ్యర్ (31) ఫర్వాలేదనిపించారు. సఫారీ బౌలర్లలో రబాడ ఐదు వికెట్లు తీయగా బర్గర్ మూడు వికెట్లు తీశాడు.

# పురుషుల క్రికెట్‌లో కొత్త రకం స్టంప్స్..?

క్రికెట్ ఆట పురోగమిస్తున్న కొద్దీ, సాంకేతికత కూడా అభివృద్ధి చెందుతున్నట్లు కనిపిస్తోంది. ఇంతకు ముందు క్రికెట్ ఆటలో చెక్కతో చేసిన సాధారణ స్టంప్‌లను ఉపయోగించేవారు.ఆ తర్వాత లైట్లతో స్టంప్‌లు వచ్చాయి. అందులో బంతి తగిలిన వెంటనే లైట్లు వెలుగుతాయి. అయితే, ఇప్పుడు పురుషుల క్రికెట్‌లో కొత్త రకం 'ఎలక్ట్రానిక్ స్టంప్స్' వచ్చేశాయి. ఇందులో ఒకటి కాదు అనేక రకాల లైట్లు వెలుగుతున్నట్లు వీడియోలో చూడొచ్చు. 'ఎలక్ట్రా స్టంప్స్'లో పలు సందర్భాలను బట్టి లైట్లు వెలుగుతాయి. ఉదాహరణకు, అవుట్, ఫోర్-సిక్స్, నో బాల్, ఓవర్ల మధ్య వేర్వేరు లైట్లు వెలుగుతుంటాయి. కాబట్టి, ఏ సమయంలో ఎలాంటి లైట్లు వెలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.. మహిళల బిగ్ బాష్ లీగ్‌లో 'ఎలక్ట్రా స్టంప్స్' ఉపయోగించారు. అదే సమయంలో పురుషుల బిగ్ బాష్ లీగ్‌లో తొలిసారిగా 'ఎలక్ట్రా స్టంప్స్'ను ఉపయోగిస్తున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ 'ఎలక్ట్రా స్టంప్స్' ఎప్పుడు ఉపయోగిస్తారోనని ఫ్యాన్స్ అంతా ఇప్పుడు ఆసక్తికరంగా ఉంటుంది. ఈ రోజుల్లో కొనసాగుతున్న బిగ్ బాష్ లీగ్ 2023-24 సీజన్‌లో 11వ మ్యాచ్ నుంచి ఈ స్టంప్‌లు ప్రారంభమయ్యాయి. డిసెంబర్ 22న, బిగ్ బాష్ లీగ్ అధికారిక సోషల్ మీడియా ద్వారా ఒక వీడియో సోషల్ మీడియాలో పంచుకున్నారు. దీనిలో 'ఎలక్ట్రా స్టంప్స్' గురించి సమాచారం అందించింది. మార్క్ వా, మైఖేల్ వాన్ 'ఎలెక్ట్రా స్టంప్స్' గురించి సమాచారాన్ని అందించారు. దీనిలో స్టంప్స్ ఏ సమయంలో



వెలుగుతాయో చూపించారు. గతంలో బంతి తగిలినప్పుడే స్టంప్‌పై రంగులు, లైట్లు కనిపించేవి. కానీ, ఇప్పుడు ఇందులో ఎన్నో మార్పులు వచ్చాయి.

# చైనా షాకిచ్చిన బీసీసీఐ..?

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024 కోసం బీసీసీఐ సిద్ధమైంది. ఇటీవల దుబాయ్‌లో మినీ వేలం ముగిసింది. అక్కడ ఆటగాళ్లపై డబ్బుల వర్షం కురిపించింది. ఇప్పుడు బీసీసీఐ మరో కీలక నిర్ణయం తీసుకుంది. IPL 2024 కోసం టైటిల్ స్పాన్సర్ కోసం అన్వేషణ కొనసాగుతోంది. ఈసారి BCCI టైటిల్ స్పాన్సర్‌షిప్ కోసం చైనాను నిషేధించడానికి సిద్ధమవుతోంది. ఇటీవలి కాలంలో భారత్‌తో మంచి సంబంధాలు లేకపోవడమే ఇందుకు కారణంగా నిలిచింది.క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం, ఐపీఎల్ టైటిల్ స్పాన్సర్‌షిప్ కోసం బీసీసీఐ వేసిన టెండర్‌లో భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలు లేని దేశాలకు ప్రాధాన్యత ఇవ్వమని స్పష్టంగా పేర్కొంది.టైటిల్ స్పాన్సర్‌షిప్‌కు బేస్ ప్రైస్ ఏడాదికి రూ.360 కోట్లుగా పేర్కొంది. ఆ తర్వాత బిడ్ ఆధారంగా టెండర్ ఇవ్వబడుతుంది. ఇంతకుముందు, చైనీస్ ఫోన్ కంపెనీ వివో ఐపీఎల్‌కు స్పాన్సర్‌గా ఉంది. అయితే 2020 సంవత్సరంలో ఇండియా-చైనా సరిహద్దులో పరిస్థితి క్షీణించినప్పుడు, వివోను తొలగించాలని బీసీసీఐ నిర్ణయించింది. టాటా ఒక సంవత్సరం టైటిల్ స్పాన్సర్‌గా ఉంది. కాగా, బీసీసీఐ తన టెండర్‌లో భారత్‌తో సత్సంబంధాలు లేని ఏ దేశంతోనూ ఎలాంటి బిడ్డర్‌కు సంబంధం ఉండకూడదని రాసుకొచ్చింది. ఇటువంటి బిడ్డర్ ఎవరైనా ముందుకు వస్తే, అతను తన వాటాదారులకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని బోర్డుకి ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాత మాత్రమే బిడ్‌పై ఏదైనా నిర్ణయం తీసుకోబడుతుందని తెలిపింది.ఇది మాత్రమే కాదు, ఫాంటసీ గేమ్స్, క్రిప్టోకరెన్సీ, బెట్టింగ్‌లకు సంబంధించిన




కంపెనీలను కూడా బోర్డు నిషేధించింది. ఇది మాత్రమే కాదు, క్రీడలకు సంబంధించిన దుస్తులను తయారు చేయడంలో చురుకుగా ఉన్న కంపెనీలు టైటిల్ స్పాన్సర్‌షిప్ కోసం వేలం వేయలేవు. టైటిల్ స్పాన్సర్‌షిప్ కాంట్రాక్ట్ ఐదేళ్లపాటు ఉంటుంది.

# డేవిడ్ వార్నర్ అరుదైన రికార్డ్..?

మెల్‌బోర్న్‌లో పాకిస్థాన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో డేవిడ్ వార్నర్ ప్రత్యేక రికార్డును లిఖించాడు. టాస్ గెలిచిన పాకిస్థాన్ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది.అందుకు తగ్గట్టుగానే ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా జట్టుకు డేవిడ్ వార్నర్, ఉస్మాన్ ఖవాజాలు శుభారంభం అందించారు.తొలి వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన డేవిడ్ వార్నర్ (38).. స్లిప్ వద్ద సల్మాన్ అలీ ఆఘా చేతికి చిక్కాడు. ఈ ఇన్నింగ్స్‌లో 38 పరుగులతో వార్నర్ అంతర్జాతీయ క్రికెట్‌లో ఆస్ట్రేలియా తరపున అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు.గతంలో స్టీవ్ వా ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. ఆసీస్ మాజీ కెప్టెన్ 548 ఇన్నింగ్స్‌లలో 18496 పరుగులు చేశాడు. ఇప్పుడు ఈ రికార్డును డేవిడ్ వార్నర్ బద్దలు కొట్టి రెండో స్థానంలో నిలిచాడు.ఆస్ట్రేలియా తరపున 460 ఇన్నింగ్స్‌లు ఆడిన డేవిడ్ వార్నర్.. ఇప్పటివరకు 18502 పరుగులు చేశాడు. దీంతో ఆసీస్ తరపున అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. ఈ జాబితాలో రికీ పాంటింగ్ అగ్రస్థానంలో ఉన్నాడు. పాటింగ్ అంతర్జాతీయ క్రికెట్‌లో 667 ఇన్నింగ్స్‌ల ద్వారా మొత్తం 27368 పరుగులు సాధించాడు. దీంతో ఆస్ట్రేలియా తరపున అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు.

ఈ జాబితాలో డేవిడ్ వార్నర్ 2వ స్థానంలో ఉన్నా.. అగ్రస్థానంలో ఉండలేదని చెప్పొచ్చు. ఎందుకంటే జనవరి 3 నుంచి పాకిస్థాన్‌తో జరిగే 3వ మ్యాచ్ ద్వారా వార్నర్ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలుకనున్నాడు.అలాగే 37 ఏళ్ల వార్నర్ ఇక నుంచి వన్డే, టీ20



జట్లలో కనిపించడం అనుమానమే. అందువల్ల ఆస్ట్రేలియా తరపున 27,000కు పైగా పరుగులు చేసిన రికీ పాంటింగ్ రికార్డు సేఫ్ అని చెప్పొచ్చు. మెల్‌బోర్న్ వేదికగా పాకిస్థాన్‌తో జరుగుతున్న 2వ టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టుకు శుభారంభం లభించింది. ఓపెనర్లు డేవిడ్ వార్నర్ (38), ఉస్మాన్ ఖవాజా (42) శుభారంభం ఇచ్చి వికెట్లను కోల్పోయారు. తొలి రోజు ఆటముగిసే సమయానికి 66 ఓవర్లలో ఆస్ట్రేలియా జట్టు 3 వికెట్లు కోల్పోయి 187 పరుగులు చేసింది. క్రీజులో మార్నస్ లాబుషాగ్నే (44), ట్రావిస్ హెడ్ (9) బ్యాటింగ్ చేస్తున్నారు.

# జాతీయ స్థాయిలో పోటీపడనున్న దీపా కర్మాకర్


భారత స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ మళ్లీ జాతీయ స్థాయిలో ఆడనుంది. ప్రతిష్ఠాత్మక సీనియర్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ నేషనల్ చాంపియన్‌షిప్స్ లో ఆమె పోటీ పడనుంది.

ఎనిమిదేండ్ల తర్వాత దీప ఈ పోటీల్లో పాల్గొంటుండడం విశేషం. అయితే. ఇదే ఆమెకు చివరి సీనియర్ నేషనల్స్ అని ఆమె కోచ్ కోచ్ బిశ్వేశ్వర్ నంది చెప్తున్నాడు.

'దీప సీనియర్ నేషనల్స్‌లో ఆడనుంది. ఆమె చివరిసారిగా 2015లో జాతీయ స్థాయిలో పోటీపడింది. ఈసారి జరిగే పోటీలు దీపకు చివరివి కానున్నాయి. ప్రస్తుతం మోకాలి గాయం నుంచి కోలుకుంటున్న దీప టోర్నీ సమయానికి కల్లా ఫిట్‌నెస్ సాధిస్తుంది' అని బిశ్వేశ్వర్ వెల్లడించాడు.

ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత తొలి మహిళా జిమ్నాస్ట్‌గా చరిత్ర సృష్టించిన దీప.. ఆ తర్వాత డోప్ పరీక్షలో పట్టుబడిన విషయం తెలిసిందే.

ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో జనవరి 2వ తేదీ నుంచి టోర్నీ మొదలవ్వనుంది. ఇందులో టోక్యో ఒలింపిక్స్‌లో పతకం గెలిచిన



ప్రణతి నాయక్‌తో పాటు యోగేశ్వర్ సింగ్, రాకేశ్ పత్రా, తపన్ మొహంతి, సైఫ్ తంబోలి, గౌరవ్ కుమార్ తదితరులు పోటీ పడనున్నారు.

ఈ టోర్నీలో దేశనలుమూలల నుంచి 550 మంది అథ్లెట్లు, వాళ్లకు సహాయకంగా 120 మంది కోచ్‌లు, 100 మంది అధికారులు కలిపి 750 మంది పాల్గొననున్నారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**